ఆదివారం
09-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 18
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కుప్పకూలిన డచ్ ప్రభుత్వం

డచ్ ప్రభుత్వం కుప్పకూలింది. నాలుగు పార్టీలతో కూడిన సంకీర్ణ ప్రభుత్వంలో వలసలకు సంబంధించి తీవ్రస్థాయిలో అభిప్రాయ బేధాలు తలెత్తాయి. వలసలు-శరణార్థులకు పరిధి నిర్ణయించే దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమైన కారణంగా అధికార కూటమి చీలిపోయింది.

2 లో

అవినీతి చక్రవర్తి కేసీఆర్

- దేశాభివృద్ధిలో తెలుగువారి ప్రతిభ కీలకం
- తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారం
- వరంగల్ సభలో ప్రధాని మోదీ

విశాలాంధ్ర- హైదరాబాద్: కేసీఆర్ ప్రభుత్వంపై ప్రధాని నరేంద్రమోదీ ఎదురుదాడి చేశారు. కేసీఆర్‌ది అత్యంత అవినీతి ప్రభుత్వమని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం యువతను, విద్యార్థులను పూర్తిగా విస్మరించిందని, తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఇతోధికంగా సాయమందించిందని చెప్పుకొచ్చారు. గడిచిన 9 ఏళ్లలో దేశాభివృద్ధిలో తెలుగువారి ప్రతిభ కీలకంగా మారిందని మోదీ అన్నారు. ముఖ్యంగా ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ చాలా కీలకంగా పనిచేసిందన్నారు. తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసేందుకు వచ్చిన మోదీ... శనివారం హన్మకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఏర్పాటు చేసిన విజయసంకల్ప సభలో ప్రసంగించారు. ముందుగా తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభిస్తూ ప్రజలను అకట్టుకునే ప్రయత్నం చేశారు. దేశానికి ఇది స్వర్ణ సమయమని, రూ.6వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు ఇప్పుడు ప్రారంభించుకుంటున్నామని మోదీ వివరించారు. దేశాభివృద్ధి కోసం శరవేగంగా పనులు పూర్తిచేస్తున్నామని, అనేక ఆర్థిక కారిడార్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఇండస్ట్రియల్-ఎకనామిక్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో చారిత్రక, ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలున్నాయన్నారు. కరీంనగర్ గ్రానైట్ పరిశ్రమకు కేంద్రం సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. రైల్వే ఉత్పత్తుల విషయంలో రికార్డులు సృష్టిస్తున్నామని, తెలంగాణలో రైల్వే రహదారుల కనెక్టివిటీ పెంచుతున్నామని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అన్ని రకాలుగా సహకరిస్తోందన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు అనేకమంది ముందుకు వస్తున్నారని తెలిపారు. తెలంగాణ ముందు అపార అవకాశాలు ఉన్నాయని, నూతనంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం గడిచిన 9 ఏళ్ల నుంచి ఎంతో కృషి చేస్తున్నామని వెల్లడించారు. కొత్త లక్ష్యాల కోసం కొత్త మార్గాలు అన్వేషించాలని అన్నారు. లాజిస్టిక్స్ సదుపాయం లేకపోతే వ్యాపారాలు నష్టపోతాయని తెలిపారు. రాష్ట్రంలో 2500 కిమీ పొడవు ఉన్న జాతీయ రహదారులు... ఇప్పుడు 5 వేల కిలో మీటర్లకు పెరిగాయని చెప్పారు.

అవినీతిలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మించిన వారు లేరని ప్రధాని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అంటే అత్యంత అవినీతి ప్రభుత్వమని, వారి అవినీతి దిల్లీకి పాకిందని ప్రధాని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడమే బీఆర్ఎస్ ప్రభుత్వం

- మిగతా 2 లో

బెంగాల్‌లో రక్తపాతం

- పంచాయతీ ఎన్నికల వేళ హింస
- పేలిన బాంబులు - బూత్‌లు ధ్వంసం
- బ్యాలెట్లకు నిప్పు
- వేర్వేరు ఘటనల్లో 14 మంది మృతి
- మృతుల్లో ఎనిమిది మంది టీఎంసీ కార్యకర్తలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో పంచాయతీ ఎన్నికల వేళ రక్తపాతం జరిగింది. ప్రశాంతంగా జరగాల్సి పోలింగ్ హింసాత్మకంగా మారగా అనేకచోట్ల బాంబు పేలుళ్లు సంభవించాయి. బ్యాలెట్ బాక్సులు చోరీకి గురయ్యాయి. కొన్ని చోట్ల వాటిని ధ్వంసం చేశారు. బ్యాలెట్లకు నిప్పుపెట్టారు. బూత్‌లనూ ధ్వంసం చేశారు. రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ క్రమంలో 14 మంది ప్రాణాలు కోల్పోగా ఇందులో ఎనిమిది మంది టీఎంసీ కార్యకర్తలు కాగా సీపీఎం కాంగ్రెస్, ఐఎస్ఎఫ్ కార్యకర్తలున్నారు. హింసపై పార్టీల పరస్పరం నిందారోపణలు చేసుకున్నారు. సుమారు 17 జిల్లాల్లో రిగ్గింగ్, నకిలీ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. ముర్షిదాబాద్, నాడియా, కూచ్‌బిహార్, దక్షిణ 24 పరగణాలు, పుర్బా, మెద్నిపూర్‌లోని నందిగ్రామ్ ప్రాంతాలు హింసకు కేంద్రాలుగా మారాయి. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కూచ్‌బెహార్‌లోని పోలింగ్ కేంద్రాన్ని ఆందోళనకారులు ధ్వంసం చేశారు. బ్యాలెట్ పత్రాలను దగ్ధం చేశారు. రాణినగర్‌లో టీఎంసీ, సీపీఎం కార్యకర్తల మధ్య ఘర్షణలో కొందరు గాయపడ్డారు. జల్‌పాయ్‌గురిలో టీఎంసీ అభ్యర్థిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. ఘర్షణల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. అనేకచోట్ల నిషేధాజ్ఞలు

- మిగతా 2 లో

పార్లమెంటులో మణిపూర్‌పై మాట్లాడతాం

- ఈశాన్య రాష్ట్ర పర్యటనలోని సీపీఐ, సీపీఎం ఎంపీలు
- అమెరికా రాయబారి వ్యాఖ్యలకు ఖండన
- అగ్రరాజ్యం జోక్యంతో సమస్య జఠిలమౌతుంది: వినయ్ విశ్వం

ఇంఫాల్: మణిపూర్ పరిస్థితులను పార్లమెంటులో లేవనెత్తుతామని సీపీఐ, సీపీఎం ఎంపీలు నొక్కిచెప్పారు. ఈశాన్య రాష్ట్రంపై అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. హింసతో అట్టుడికిపోతున్న రాష్ట్రంలో శాంతి ప్రక్రియను మొదలు పెట్టాలని సూచించారు. ఈశాన్య రాష్ట్ర ప్రజల బాధతలు పంచుకుంటూ వారికి భరోసానిచ్చారు. సమస్యను పరిష్కరిస్తామని అమెరికా ఎప్పుడు జోక్యం చేసుకున్నా ఆ సమస్య పెద్దవుతుందేగానీ పరిష్కారం కాబోదని మణిపూర్ అంశంలో అమెరికా ప్రతిపాదనుద్దేశించి సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం అన్నారు. రాజకీయ ఆటలకు అమెరికాకు కేంద్రం దారి చూపిందని వ్యాఖ్యానించారు. మే నుంచి రాష్ట్రంలో ఇంటర్నెట్ లేకపోవడాన్ని ప్రస్తావిస్తూ ఇలా అయితే కార్యక్రమాలు ఎలా జరుగుతాయి... పురోగతి ఎలా సాధ్యమని వినయ్ విశ్వం ప్రశ్నించారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు తక్షణ చర్యలను చేపట్టాలని అధికారులకు సూచించారు. సీపీఎం ఎంపీలు వికాశ్ భట్టాచార్య, జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ మణిపూర్ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయన్నారు. రెండు నెలలుగా రాష్ట్రం రగిలిపోతుంటే ప్రధాని దీని గురించి మాటైనా మాట్లాడలేదన్నారు. ఇది రాష్ట్ర ప్రజలపై పాలకులకు ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టంచేస్తుందని అన్నారు. పార్లమెంటులో తప్పక మణిపూర్ అంశాన్ని లేవనెత్తుతామని భట్టాచార్య చెప్పారు. శాంతి ప్రక్రియను మొదలు పెట్టాలంటే ముందుగా అన్ని వర్గాల ప్రజల విశ్వాసాన్ని పొందాలని, ప్రస్తుత ప్రభుత్వం దానిని కోల్పోయిందని బ్రిట్టాస్ అన్నారు. ముఖ్యమంత్రి ఎన్.బిరేన్ సింగ్

- మిగతా 2 లో

రైతన్నను రారాజును చేశాం

కళ్యాణదుర్గంలో రైతు దినోత్సవంలో సీఎం జగన్ 2 లో

ఉద్యోగుల కన్నెర్ర

2 లో

అలుపెరుగని 'అమరావతి' పోరు

- రాజధాని ఉద్యమానికి 1300 రోజులు
- నేడు '4ఏళ్ల నరకంలో వనగరం' పేరుతో సభ
- హాజరుకానున్న అన్ని రాజకీయపక్షాల నేతలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దేశ చరిత్రలో ఎక్కడా, ఎన్నడూ లేని విధంగా అమరావతి రాజధాని ఉద్యమం నిరంతరం కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులపై అక్రమ కేసులు బనాయించి, లాఠీలు ఝుళిపించి ఉక్కుపాదంతో అణచాలని ప్రయత్నించినా... చివరకు యావత్ ప్రపంచాన్ని స్తంభింపజేసిన కరోనా వైరస్ సైతం అమరావతి ఉద్యమాన్ని కట్టడి చేయలేకపోయింది. ప్రతిపక్షంలో ఉండగా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మా ప్రభుత్వ హయాంలో అన్నీ పెరిగాయి.. అల్లర్లు, టమోటాలు, బియ్యం..ఇంకా చాలా!

కొల్లేరు కనుమరుగేనా?

- అక్రమ తవ్వకాలు ఆపేదెవరు?
- సుప్రీంకోర్టు ఉత్తర్వులు బుట్టదాఖలు
- అధికార పార్టీ నేతల అండ
- పట్టించుకోని అధికారులు

2 లో

అశ్రుతాంజలి

కామ్రేడ్ దేవభక్తుని రంగారావు

ప్రతినిత్యం మా అభివృద్ధి కోసం
కృషిచేస్తూ,
నిరంతరం శ్రమిస్తూ
దివికేగిన మిమ్ములను స్మరిస్తూ
ఇవే మా అశ్రునివాళి

భార్య
దేవభక్తుని నిర్మల

కుమారులు
దేవభక్తుని వీరరాఘవయ్య (లేటు)
దుర్గానాగమల్లేశ్వరి
దేవభక్తుని అజయకుమార్ (USA)
శారద

కుమార్తెలు
యానాల రత్నకుమారి
రామరావు
గుంజా సంధ్యారాణి
రాజశేఖర్

మనుమళ్లు
యానాల గౌతమ్ (UK)
గుంజా వినీల్
దేవభక్తుని అనిరుధ్ (USA)
రఘువంశీ (USA)

మరదలు
పరుచూరి నీలకంఠేశ్వరమ్మ
సత్యనారాయణ (లేటు)

మనుమరాళ్లు
దేవభక్తుని హిమాని (USA)
మొగళ్లపు ప్రత్యూష (USA)
రాజానందగోపాల్ (USA)

మునిమనుమరాలు: నిహార

09-07-2023 ఆదివారం నాడు మచిలీపట్నం, భాస్కరపురంలోని త్రిశక్తిపీఠంవద్ద మా స్వగృహమునందు సంస్మరణ కార్యక్రమం జరుగును
సెల్ : 93906 69640

లాట్వియా అధ్యక్షుడిగా రిన్‌కెవిక్స్ ప్రమాణం

మాజీ ఆర్థిక మంత్రిని వరించిన పదవి

రిగా: లాట్వియా దేశాధ్యక్షుడిగా ఎడ్‌గర్స్ రిన్‌కెవిక్స్ ప్రమాణ స్వీకారం చేశారు. 11ఏళ్లకుపైగా దౌత్య కార్యాలయం బాధ్యతలు చేపట్టిన మాజీ ఆర్థిక మంత్రిని ఈ పదవి వరించింది. లాట్వియన్ ప్రజలకు తన జీవితం అంకితమని, వారి శ్రేయస్సు కోసం పనిచేస్తానని ఆయన ప్రతిజ్ఞ చేశారు. '11ఏళ్ల ఎనిమిది నెలల 11 రోజుల పాటు లాట్వియా విదేశాంగ మంత్రిగా పనిచేశాను. నాకు మద్దతిచ్చి అండగా నిలిచిన లాట్వియన్ ఎంఎఫ్ఏ బృందానికి, సహచరులు, విదేశీ మిత్రులు అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నా...' అని ఆయన ట్వీట్ చేశారు. కొత్త విదేశాంగ మంత్రి నియామకం జరిగేంత వరకు ఆ బాధ్యతలను ప్రస్తుత ప్రధాని క్రిస్‌జనిస్ కరిన్స్ చేపడతారు. మే 31న జరిగిన మూడో విడత ఎన్నికల్లో కొత్త అధ్యక్షుడిగా రిన్‌కెవిక్స్ ఎన్నికయ్యారు. ఎన్నికల్లో మొత్తం 100 మంది పార్లమెంటు సభ్యులు పాల్గొనగా 52 అనుకూల, 35 వ్యతిరేక ఓట్లు వచ్చాయి. 51ఓట్లు వస్తే అభ్యర్థి ఎన్నికైనట్లు లెక్క. నాలుగేళ్ల కాలపరిమితి కోసం లాట్వియా అధ్యక్షుడిని పార్లమెంట్ ఎన్నుకుంటుంది.

కుప్పకూలిన డచ్ ప్రభుత్వం

వలసవాద విధానంపై కుదరని రాజీ

అధికార కూటమిలో చీలిక

ప్రధాని రుట్టే, కేబినెట్ రాజీనామా

నవంబరులో నెథర్లాండ్స్ ఎన్నికలు

ఆమ్‌స్టర్‌డామ్: డచ్ ప్రభుత్వం కుప్పకూలింది. నాలుగు పార్టీలతో కూడిన సంకీర్ణ ప్రభుత్వంలో వలసలకు సంబంధించి తీవ్రస్థాయిలో అభిప్రాయ బేధాలు తలెత్తాయి. వలసలు-శరణార్థులకు పరిధి నిర్ణయించే దిశగా చర్యలు తీసుకోవడంలో విఫలమైన కారణంగా అధికార కూటమి చీలిపోయింది. దీంతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు డచ్ ప్రధాని మార్క్ రుట్టే వెల్లడించారు. సుదీర్ఘకాలం దేశానికి ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన రుట్టే తన ప్రభుత్వం తరపున రాజీనామా లేఖను రాజు అలెగ్జాండర్‌కు అందజేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు వరకు ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగనున్నారు. తాజా పరిణామాల క్రమంలో ఏడాది చివరిలో దేశానికి ఎన్నికలు అనివార్యమయ్యాయి.

రుట్టే ది హేగ్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'వలసవాద విధానానికి సంబంధించి సంకీర్ణ భాగస్వామ్యులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్నది చెప్పడంలో రహస్యమేమీ లేదు. ఇందుకు పరిష్కారం లభించడం సాధ్యంకాదని తేలిపోయింది. ఏకాభిప్రాయం కుదరని పక్షంలో రాజీనామా నిర్ణయం తీసుకున్నాం. మొత్తం కేబినెట్ తరపున రాజీనామా పత్రాన్ని రాజు అలగ్జాండర్‌కు అందజేశా' అని చెప్పారు. వలసవాద విధానంపై ఒప్పందం చేసుకునేందుకుగాను బుధ, గురువారాలలో అర్ధరాత్రి వరకు రుట్టే జరిపిన చర్చలు ఫలించలేదు. శుక్రవారం సాయంత్రం తుది దశ చర్చల్లోనూ రాజీ కుదరలేదు. ఏకాభిప్రాయం అసాధ్యమన్న నిర్ణయానికి పార్టీలు వచ్చాయి. కలిసి ముందుకెళ్లమని విడిపోవాలని నిర్ణయించాయి. దీంతో ప్రతిపక్షాలు ఏ మాత్రం ఆలశ్యం చేయకుండా ఎన్నికలకు పిలుపునిచ్చాయి. రాజీనామాను రుట్టే అధికారికంగా ధ్రువీకరించేంత వరకు కూడా ఆగలేదు. 'ఇక ఎన్నికలే తరువాయి' అని యాంటీ ఇమిగ్రేషన్ పార్టీ ఫర్ ఫ్రీడమ్ నేత గ్రెట్ విల్డర్స్ ట్వీట్ చేశారు. ఈ దేశానికి మార్పు అవసరమని గ్రీన్ లెఫ్ట్ నాయకుడు జెస్సే క్లావెర్ వెల్లడించారు.

తాజా పరిణామాలతో నెథార్లాండ్స్ పార్లమెంటరీ ఎన్నికలు నవంబరులో జరుగుతాయని డచ్ ఎన్నికల మండలి ప్రకటించింది. ఈమేరకు నెథర్లాండ్స్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (ఎన్‌ఓఎస్) తెలిపింది. తన కుటుంబంతో పాటు గడిపేందుకు గ్రీస్ వెళ్లిన డచ్ రాజు విల్లమ్ అలగ్జాండర్ తన పర్యటనను అర్థాంతరంగా ముగించుకుని తిరిగొచ్చారు. శనివారం హేగ్‌లోని హుయ్యస్ టెన్ బాష్ రాయల్ ప్యాలెస్‌లో మార్క్ రుట్టేతో భేటీ అయ్యారు. కాగా, రుట్టే ప్రభుత్వం 18 నెలల కిందట అధికారంలోకి వచ్చింది. తమ దేశంలో శరణ కోరేవారి సంఖ్యను కట్టడి చేసేందుకు అన్ని విధాలా యత్నించింది. శరణాలయాలను రెండు విభాగాలుగా విభజించాలని, తాత్కాలిక శిబిరంలో ఘర్షణల వల్ల శరణం కోరే వారిని ఉంచాలని, శాశ్వత శిబిరంలో మిగతా శరణార్థులను ఉంచేలా ప్రతిపాదనలు వచ్చాయి. నెథర్లాండ్స్‌లో శరణ కోరే కుటుంబ సభ్యుల సంఖ్య తగ్గించాలన్న ఆలోచనను కూడా రుట్టే ప్రభుత్వం చేసింది. కానీ ఏది అనుకూలంగా పరిణమించలేదు. గతేడాది శరణాలయాలు కిటకిటలాడగా కొన్ని వందల మంది ఆరు బయట నిద్రించే పరిస్థితి ఏర్పడింది. 2022లో యూరప్ బయట నుంచి వచ్చి 21,500 మందికి నెథర్లాండ్స్ ఆశ్రయమిచ్చింది. పని-విద్యాభ్యాసం కోసం లక్షలాది మంది నెథర్లాండ్స్‌కు వస్తుంటారు. దీనికి శరణార్థులు తోడు కావడం ఆ ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. జనాభా పెరగడంతో వసతి కల్పన సమస్యగా తయారైంది. కొత్తగా వచ్చిన శరణార్థులకు వసతిని మున్సిపాలిటీలే కల్పించేలా చట్టాన్ని రుట్టే ప్రభుత్వం తెచ్చింది కానీ దానిని పార్లమెంటు ఉభయ సభల ఆమోదించాల్సివుంది.

భారత్ వ్యవహారాల్లో అమెరికా జోక్యం వద్దు : సీపీఐ

న్యూఢిల్లీ: మణిపూర్ సమస్యకు పరిష్కారం చూపేందుకు సాయం చేస్తామని అమెరికా చేసిన ప్రతిపాదనను భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తప్పుపట్టింది. భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యాన్ని ఆక్షేపించింది. ఇటీవల బెంగాల్ రాజధాని కోల్‌కతాలో విలేకరులతో మాట్లాడిన భారత్‌కు అమెరికా దౌత్యాధికారి ఎరిక్ గార్సెట్టి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం శనివారం ఒక ప్రకటన చేసింది. మణిపూర్‌లో హింసను పరిష్కరించడంలో సాయం కావాలని భారత్ కోరితే అమెరికా సానుకూలంగా స్పందిస్తుందని గార్సెట్టి అన్నారు. ఈ క్రమంలో భారత అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చవద్దని అమెరికాకు సీపీఐ సూచించింది.

మణిపూర్‌పై మాట్లాడతాం

(మొదటిపేజీ తరువాయి)

రాజీనామా చేయాలన్నారు. ఈ సమస్యలో బీరేన్ సింగ్ భాగస్వామి కాబట్టే దానిని పరిష్కరించలేకపోయారని దిల్లీలో అఖిలపక్ష సమావేశమప్పుడు చెప్పామని గుర్తుచేశారు. ఈనెల 6న కోల్‌కతాలో విలేకరులతో మాట్లాడిన గార్సెట్టి... మణిపూర్‌లో హింస, హత్యలు మానవవతాంశమని, భారత్ కోరితే సాయం చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందని చెప్పిన విషయం తెలిసిందే.

అవినీతి చక్రవర్తి కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యమన్నారు. కేసీఆర్ కుటుంబం కుంభకోణాల్లో ఇరుక్కుందని, కేంద్ర దర్యాప్తు సంస్థలు వాటిని వెలికితీసే పనిలో పడ్డాయని బెదిరించారు. భద్రకాళి అమ్మవారి మహత్యానికి, సమ్మక్క-సారలమ్మ శౌర్యానికి, రాణీ రుద్రమ పరాక్రమానికి నిదర్శనమైన వరంగల్‌కు రావడం సంతోషంగా ఉందన్నారు. జనసంఘ్ కాలం నుంచి ఈ ప్రాంతం తమ భావజాలానికి బలమైన కోటగా ఉందని చెప్పారు. తన ప్రసంగంలో కేసీఆర్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కుటుంబ పాలన, అవినీతి ప్రభుత్వం అంటూ పదే పదే వక్కాణించారు. దేశంలో కుటుంబ పార్టీలన్నింటికీ అవినీతి పునాది ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అవినీతిని పెంచి పోషించిందని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం కేవలం నాలుగు పనులు మాత్రమే చేసిందని చెబుతూ...ఉదయం, సాయంత్రం మోదీని, కేంద్ర ప్రభుత్వాన్ని దుర్భాషలాడటం, ఒక కుటుంబాన్ని అధికార కేంద్రీకృతం చేసి తెలంగాణకు వారే యజమాని అని నిరూపించుకోవడం, తెలంగాణ ఆర్థికాభివృద్ధిని అడ్డుకోవడం, తెలంగాణను అవినీతిలో ముంచడం అంటూ విరుచుకుపడ్డారు. ఈ 9 సంవత్సరాలలో ప్రపంచంలోనే భారతదేశం గర్వం పెరిగిందన్నారు. అందరూ భారతదేశం వైపు చూస్తున్నారని, దీనివల్ల తెలంగాణ కూడా లాభపడిందని తెలిపారు. గతంలో కంటే ఎక్కువగా పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. అభివృద్ధి కోసం రాష్ట్రాలు కలిసి పనిచేస్తాయని, అవినీతి కోసం దిల్లీ, తెలంగాణ ప్రభుత్వాలు కలిసి పనిచేస్తున్నాయని విమర్శించారు. ఇందుకోసమేనా తెలంగాణ యువత ఆత్మబలిదానాలు చేసిందని ప్రశ్నించారు. అవినీతి నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నాలు కేసీఆర్ చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేశారని అన్నారు. టీఎస్‌పీఎస్సీ స్కామ్‌తో యువత ఎంతో నష్టపోయారని అన్నారు. కాంగ్రెస్ అయినా, బీఆర్‌ఎస్ అయినా తెలంగాణ ప్రజలకు రెండూ ప్రాణాంతకమేనన్నారు. ఈ రెండింటి నుంచి తెలంగాణ ప్రజలను కాపాడాలని కోరారు. తెలంగాణ వర్సిటీల్లో మూడువేల అధ్యాపక పోస్టులు భర్తీ చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో 15 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, నిరుద్యోగ యువతకు రూ.3 వేల భృతి ఇవ్వలేదని అన్నారు. 9 ఏళ్లలో కేంద్రం గ్రామపంచాయతీలకు లక్ష కోట్లకు పైగా నిధులు ఇచ్చిందని చెప్పారు. ఆ నిధులను తెలంగాణ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తున్నదని విమర్శించారు. తాము రైతుల పంటకు మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చి చేసి చూపించామని తెలిపారు. తెలంగాణకు మెగా టెక్స్‌టైల్ పార్క్ ఇచ్చామని, కేసీఆర్ ప్రభుత్వం మాత్రం ఎస్సీ, ఎస్టీ, పేదలను మోసం చేసిందని విమర్శించారు. ఆదివాసీ గ్రామాలకు ఎలాంటి మౌలిక సౌకర్యం కల్పించడం లేదని మండిపడ్డారు. సభకు వచ్చిన జనాన్ని చూస్తే హైదరాబాద్‌లో కొందరికి నిద్రపట్టదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీజేపీ తొలుత సాధించిన రెండు లోక్‌సభ సీట్లలో ఒకటి హన్మకొండ అని గుర్తు చేశారు. ఈ రోజు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందన్నారు.

2021 మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బీజేపీ ట్రైలర్ చూపించిందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను అడ్రస్ లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అలుపెరుగని 'అమరావతి' పోరు

(మొదటిపేజీ తరువాయి)

అమరావతి రాజధానిని సమర్థించిన జగన్‌మోహన్ రెడ్డి, అధికార పీఠం ఎక్కగానే ఇంత దారుణంగా అడ్డం తిరుగుతారని ఊహించలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ హామీతో రాజధాని నిర్మాణం కోసం ఉచితంగా భూములిచ్చిన రైతులు రాజకీయ కుట్రకు బలయ్యారు. తమకున్న ఎకరం, అర ఎకరం పొలాన్ని ప్రభుత్వానికిచ్చి, ఏం చేయాలో దిక్కుతోచక నాలుగేళ్లుగా నరకం అనుభవిస్తున్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధే తమ లక్ష్యమంటూ మూడు రాజధానులను తెరపైకి తెచ్చిన వైసీపీ ప్రభుత్వం... అమరావతి విధ్వంసానికి చేయని ప్రయత్నం లేదు. అమరావతి ఒక సామాజికవర్గానికి చెందినదని, ముంపు ప్రాంతమని, నిర్మాణాలకు భారీ వ్యయమవుతుందని, ఇదొక శ్మశాన వాటిక అని, లక్షల కోట్లు ఖర్చు అవుతుందని, ఇంత పెద్దమొత్తంలో ఖర్చు పెడితే హైదరాబాద్ తరహాలో అభివృద్ధి కేంద్రీకృతమవుతుందని....ఇలా అనేక రకాలుగా ప్రభుత్వం దుష్ప్రచారం చేసింది. కేవలం రాజకీయ కక్షతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నియంతృత్వ చర్యలకు అభంశుభం తెలియని రైతులు బలి పశువులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన పొలం వెనక్కి తీసుకునే పరిస్థితి లేక, రైతుల వాటా కింద ఇచ్చిన ప్లాట్లను అమ్ముకోలేక, ప్రశ్నార్థకంగా మారిన పిల్లల భవిష్యత్‌ను తలచుకుంటూ రైతులు నాలుగేళ్లుగా ఏడవని రోజు లేదు. రాజధాని లేని రాష్ట్రంగా నిల్చిపోకూడదని, అమరావతి అద్భుత నగరంగా వెలుగొందాలన్న ఆశతో కన్నతల్లితో సమానమైన భూములను త్యాగం చేసిన రైతుల జీవితాలతో వైసీపీ ప్రభుత్వం చెలగాటమాడుతోంది.

'మేము రాజధాని ఇక్కడ పెట్టాలని కోరలేదు. కొత్తగా గొంతెమ్మ కోర్కెలు ఏమీ కోరడం లేదు. గత ప్రభుత్వం తమతో చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని మాత్రమే కోరుతున్నాం. రాజకీయాలతో మాకు సంబంధం లేదు. మీరు కూడా ఆనాడు అమరావతికి మద్దతిస్తేనే మేం భూములివ్వడానికి ముందుకొచ్చాం. దయచేసి మాకు న్యాయం చేయండి' అంటూ రైతులు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. ఇదే నినాదంతో మూడేళ్లకు పైబడి రైతులు శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈనెల 9వ తేదీ నాటికి అమరావతి రైతుల రాజధాని ఉద్యమం 1300 రోజులకు చేరుతుంది.

నేడు మందడంలో సభ

అమరావతి ఉద్యమం 1300 రోజులకు చేరిన సందర్భంగా అమరావతి రాజధాని ఐక్య కార్యాచరణ సమితి, అమరావతి పరిరక్షణ సమితి అధ్వర్యంలో మందడంలో ఆదివారం 'నాలుగేళ్ల నరకంలో నవనగరం' పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

దీనికి అన్ని రాజకీయపక్షాల నేతలను, దళిత, మైనార్టీ, మహిళా జేఏసీ నేతలను, ప్రజాసంఘాల నేతలను ఆహ్వానించారు. రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులు, వారి కుటుంబసభ్యులతో పాటు అమరావతి ఉద్యమానికి తొలినుంచి సంఘీభావం తెలియజేస్తున్న ప్రజలంతా ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని అమరావతి జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు.

బెంగాల్‌లో రక్తపాతం

(మొదటిపేజీ తరువాయి)

అమలయ్యాయి. 600 కంపెనీల కేంద్ర బలగాలు, 70వేల మంది రాష్ట్ర పోలీసులను మోహరించారు.

66.2శాతం పోలింగ్ నమోదు

2024 లోక్‌సభ ఎన్నికలకు అగ్నిపరీక్షగా పంచాయతీ ఎన్నికలకు ఉన్నందున రాజకీయ పార్టీలు దీనిని ప్రతిష్ఠాత్మకంగా భావించాయి. శనివారం ఉదయం 6 గంటలకు 73,887 స్థానాల్లో పోలింగ్ మొదలైంది. 2.06లక్షల మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. 5.67కోట్ల అర్హులైన ఓటర్లు ఉన్నారు. సాయంత్రం 5 గంటల వరకు 66.2శాతం పోలింగ్ నమోదైంది. వెస్ట్ మిద్నాపూర్‌లో అధికంగా 79.1శాతం నమోదైంది. ఈ మేరకు ఎన్నికల అధికారులు తెలిపారు.

రాష్ట్రపతి పాలనకు బీజేపీ డిమాండ్ - ఎన్నికల రద్దుకు కాంగ్రెస్ పిటిషన్

రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని ప్రతిపక్ష నేత సువేందు అధికారి (బీజేపీ) డిమాండ్ చేశారు. ఎన్నికల హింసకు నిరసనగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నివాసమున్న కాలిఘాట్‌కు ప్రదర్శన నిర్వహిస్తామని హెచ్చరించారు. స్వేచ్ఛ, పారదర్శకంగా ఎన్నికలు జరగడం మిధ్య అని, రాష్ట్రపతి పాలనలో అధికరణ 355 కింద మాత్రమే ఎన్నికలు అలా జరుగుతాయన్నారు. డైమండ్ హార్బర్‌లోని ఓ పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రారంభించక ముందే బ్యాలెట్ బాక్సులో ఓట్లు వేశారని బీజేపీ ఆరోపించింది. అధికారి ఆరోపణలను టీఎంసీ ఖండించింది. హింస వెనుక తమ పార్టీ ఉంటే సొంత కార్యకర్తలు ఎందుకు ప్రాణాలు కోల్పోతారని ప్రశ్నించింది. బీజేపీ సొంత కథనాలు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టింది.బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్ మధ్య గొడవలు శుక్రవారం రాత్రి నుంచి జరుగుతూ షాకింగ్ ఘటనలు వెలుగుచూస్తుంటే కేంద్ర బలగాలు ఏం చేస్తున్నట్లు అని టీఎంసీ సీనియర్ నేత శశిపంజా వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా 60వేలకుపైగా బూత్‌లు ఉంటే కేవలం 60 బూత్‌లలోనే హింస జరిగి ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగినట్లు టీఎంసీ తెలిపింది. హింస జరిగినందున నేపథ్యంలో ఎన్నికలను రద్దు చేయాలని కోరుతూ కలకత్తా హైకోర్టు సీజేకు కాంగ్రెస్ నేత బాగ్చి ఫిర్యాదు చేశారు.

బాధితులకు గవర్నర్ పరామర్శ

ప్రజాస్వామ్యానికి పవిత్రమైన రోజున ఇలా రక్తపాతం జరగడం ఆందోళనకరమని గవర్నర్ సీవీ ఆనంద బోస్ అన్నారు. ఆయన ఉత్తర 24 పరాగణాల జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలను సందర్శించి హింసలో గాయపడినవారిని పరామర్శించారు. తన కాన్వాయ్‌ను ఆపాలని ప్రజలు కోరారని, చుట్టూ జరిగే హత్యల గురించి వాపోయారని విలేకరులతో మాట్లాడిన బోస్ అన్నారు. పోలింగ్ బూత్‌లకు వెళ్లకుండా గూండాలు అడ్డుకుంటున్నారని కొందరు చెప్పినట్లు తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు ఓటర్లను పట్టించుకోవడం లేదని తన దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు.

ఉద్యోగుల కన్నెర్ర

- 'జీపీఎస్'పై ఆగ్రహం
- జిల్లా కేంద్రాల్లో ప్రతిఘటనా ధర్నాలు
- సీపీఎస్ రద్దు చేయాలంటూ నిరసనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సీఎం జగన్ సర్కారుకు మళ్లీ ఉద్యోగుల నుంచి నిరసన గళం మొదలైంది. తమకు జీపీఎస్ వద్దు అని, సీపీఎస్ రద్దు చేసి దాని స్థానంలో పాత పెన్షన్ విధానం అమలు చేయాలంటూ ఉద్యోగులు ఆందోళనబాట పట్టారు. ఇటీవల సీఎం జగన్ ఆదేశాల మేరకు మంత్రివర్గ బృందంతో ఉద్యోగుల సమస్యలపై జరిగిన చర్చల్లో జీపీఎస్‌ను అమలు చేస్తామంటూ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై అప్పట్లో ఉద్యోగ సంఘాల నడుమ భిన్న స్వరాలు వినిపించాయి. ఈ వ్యవహారం ముగిసిపోయిందని ప్రభుత్వం మౌనంగా ఉండిపోగా, ఒక్కసారిగా ఉద్యోగులు షాక్ ఇచ్చారు. మళ్లీ ఉద్యమబాట పట్టారు. జగన్ సర్కారు ప్రతిపాదించిన గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) కు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట శనివారం నిరసనలకు దిగారు. మంత్రివర్గంతో జరిగిన చర్చల్లో జీపీఎస్‌ను కేవలం ప్రభుత్వానికి అనుకూలంగా నాలుగైదు ఉద్యోగ సంఘాలే అంగీకరించగా, దానిపై తిరుగుబాటు మొదలైంది. ఎక్కడికక్కడే ఆంధ్రప్రదేశ్ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీ సీపీఎస్‌ఈ) అధ్వర్యంలో ప్రతిఘటనా ధర్నాలు నిర్వహించారు. 'మాకు జీపీఎస్ వద్దు... సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ పునరుద్ధరించాలంటూ నినదించారు. విశాఖపట్నం, ఏలూరు, విజయవాడ, శ్రీకాకుళం, గుంటూరు, ఒంగోలు తదితర అన్ని జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ల ఎదుట ఉద్యోగులు ధర్నాలు చేపట్టి, జగన్ ప్రభుత్వ నిర్ణయాన్ని తూర్పారబట్టారు. ఈ ధర్నాలకు ఉద్యోగులు పెద్దఎత్తున తరలివచ్చి జగన్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీపీఎస్‌కు ఉద్యోగులంతా ఎవరు అంగీకరించారో తేల్చిచెప్పాలంటూ ఉద్యోగులు ప్రశ్నించారు. జగన్ నాడు పాదయాత్రలోను, ఎన్నికల మేనిఫెస్టోలోనూ ఇచ్చిన హామీని అమలు చేయాలంటూ నిలదీశారు. ఏపీ సీపీఎస్‌ఈ రాష్ట్ర నాయకులు రోంగలి అప్పలరాజు, గంటా శ్రీనివాసరావు తదితర నేతలు ధర్నాలకు నాయకత్వం వహించారు. వారికి ఏపీ సెక్రటరీ సీపీఎస్ ఉద్యోగులు, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. పెన్షన్ భిక్ష కాదు... ఉద్యోగుల హక్కు అంటూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సీఎం జగన్ తక్షణమే దిగివచ్చి జీపీఎస్ నిర్ణయాన్ని ఉపసంహరించి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ ఉద్యోగులు నినదించారు.

రైతన్నను రారాజును చేశాం

- కళ్యాణదుర్గంలో రైతు దినోత్సవంలో సీఎం జగన్
- 2022 ఖరీఫ్ బీమా పరిహారం రూ.1,117 కోట్లు విడుదల

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : తెలుగు రైతుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహామనిషి వైఎస్సార్ జయంతిని రైతు దినోత్సవంగా జరుపుకుంటున్న ఆంధ్ర ప్రదేశ్‌లో గడిచిన నాలుగేళ్లలో రైతన్నను అన్ని రకాలుగా ఆదుకొని రారాజుగా చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. శనివారం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో సీఎం జగన్ పర్యటించారు. ఈ సందర్భంగా ఇక్కడ నిర్వహించిన రైతు దినోత్సవంలో పాల్గొని 2022 సంవత్సరానికి పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం కింద రూ.1,117 కోట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్దన్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 10.2 లక్షల మంది రైతులకు రూ.1,117 కోట్ల మేరకు లబ్ధి చేకూరిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు బీమా పరిహారం కింద రైతులకు కేవలం రూ.3,411 కోట్లు మాత్రమే చెల్లించారని, తాము అధికారంలోకి వచ్చాక రైతులకు రూ.7,802 కోట్లు బీమా పరిహారం అందించామన్నారు. రైతులకు పగటిపూట తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, చుక్కల భూములకు సంపూర్ణ భూ హక్కులు కల్పించామని గుర్తు చేశారు. పాడి రైతులకు ఆదాయం వచ్చేలా అమూల్ తీసుకొచ్చామన్నారు. రైతన్నకు బీమా పరిహారానికి సంబంధించి తాము చేస్తున్న సహాయాన్ని గుర్తించకుండా చంద్రబాబు, గజదొంగల ముఠా మొసలి కన్నీరు కారుస్తోందని ఆరోపించారు. మనకు పాడిపంటలు పండే పాలన కావాలా లేక నక్కలు, తోడేళ్లు ఉండే పాలన కావాలా అని రైతులను ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో ఎన్నికల సంగ్రామంలో ఎవరు మంచి చేశారో వారికే ఓటు వేయాలన్నారు, రైతు భరోసా కింద నాలుగేళ్లలో కోటిన్నర మంది రైతులకు రూ.30,985 కోట్లు అందించామని గుర్తు చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు స్థానికంగానే భూసార పరీక్షలు, మార్కెట్ సదుపాయాలు, మద్దతు ధర అందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టుల సత్వర పరిష్కారం కోసం వైఎస్సార్ ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించిందని అన్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాలకు తాగు, సాగునీరు అందించే హంద్రి-నీవా పథకానికి పెద్దపీట వేశామని గుర్తు చేశారు. కుందుర్తి బ్రాంచ్ కెనాల్ భూముల కొనుగోలుకు రూ.250 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. బహిరంగ సభలో మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ కల్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువులకు నీళ్లు అందించే హంద్రి-నీవా సుజల స్రవంతి కాలువ తవ్వకాలకు నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. సీఎం జగన్ సానుకూలంగా స్పందించి నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నియోజకవర్గంలోని అనేక సామాజిక వర్గాలకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, బీసీ బాలికల వసతి గృహం, రోడ్ల నిర్మాణం, మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించారు. ఇదిలాఉండగా, అనంతపురం జిల్లా రైతాంగాన్ని మోసం చేసిన ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు ఎలా వస్తారంటూ సీపీఐ నిర్వహించిన పోరు యాత్రను పోలీసులు భగ్నం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి, మల్లికార్జున, జిల్లా కార్యవర్గ సభ్యులు సంజీవప్ప, గోపాల్ కేశవరెడ్డి తదితరులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి, ఆయన తనయుడు మారుతి చౌదరిని ఎర్రంపల్లిలో గృహ నిర్బంధం చేశారు.

కొల్లేరు కనుమరుగేనా?

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ఎటు చూసినా పచ్చదనం. పక్షుల కిలకిలా రావాలు... స్వచ్ఛమైన నీటి ప్రవాహాల జోరు... అపారమైన మత్స్య సంపద... ప్రకృతి మాత అందాన్ని రెట్టింపు చేసిన కొల్లేరు గత చరిత్ర. కబ్జాదారుల కబంధహస్తాలలో చిక్కుకున్న కొల్లేరు నానాటికి చిక్కిపోయి...కాలుష్యానికి కేరాఫ్‌గా మారింది.

కొల్లేరులో నిబంధనలు ఉంటాయి కానీ అమలు కావు. చెక్ పోస్టులు ఉంటాయి గానీ అక్రమాలను అడ్డుకోవు. పక్షుల కిలకిలారావాలు తప్ప మరేమీ వినిపించకూడని చోట పెద్దపెద్ద శబ్దాలతో పొక్లెయిన్లు తవ్వేస్తున్నా అధికారులకు వినిపించదు, కనిపించదు. రాత్రులు తవ్వడం, పగలు ఆపడం. ఎక్కడి పడితే అక్కడ, ఎలా కుదిరితే అలా చేపలు, రొయ్యల చెరువులు తవ్వేస్తూ అక్రమార్కులు కొల్లేరును కొల్లగొడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, స్థానికుల సహకారం, రాజకీయ నాయకులు, అధికారులు ఏకమై కొల్లేరు కబ్జాకు ఎవరిసాయం వారందిస్తున్నారు. చివరికి ఆక్రమణకు గురైన కొల్లేరు సరస్సుకు గర్భశోకం మిగిలింది. జరిగేదంతా చట్ట విరుద్ధమే. కొల్లేరు అభయారణ్య దురాక్రమణను ఆపే వారే లేరు. ఎక్కడికక్కడ మోహరించిన పొక్లెయిన్లు... అభయారణ్యంలో అడ్డగోలు తవ్వకాలు... ఇబ్బడి ముబ్బడిగా పుట్టుకొస్తున్న చేపల చెరువులు. ఇదంతా ఎక్కడో కాదు. చేపల చెరువుల తవ్వకాన్ని నిషేధించిన కొల్లేరు కాంటూరు పరిధిలోనే. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు రూరల్, ఉంగుటూరు, కైకలూరు, ఉండి నియోజకవర్గాల పరిధిలో ఈ ఆక్రమణలపర్వం మూడు చెరువులు, ఆరుగట్లుగా సాగిపోతోంది. 2006లో చెరువులను ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు ధ్వంసం చేసినా...నేడు రాత్రి వేళ మళ్లీ ఆక్రమణలకు యధేచ్ఛగా తెరతీస్తున్నారు. కొల్లేరు అభయారణ్యంలోకి యంత్రాలు ప్రవేశించడం చట్టరీత్యా నేరం. యంత్రాలను కొల్లేరులోకి తీసుకువెళ్లాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. కొల్లేరు ప్రాంతానికి కూతవేటు దూరంలోనే చెక్ పోస్టులు ఉన్నా అదే మార్గంలో భారీయంత్రాలు వెళుతున్నాయి. కానీ ఎవరూ నియంత్రించడం లేదు.

దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్న చందంగా రాజకీయ నాయకులు, అధికారుల అండదండలతో కొల్లేరును పూర్తిగా కబ్జా చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా హామీలు, ఎన్నికల తర్వాత ఆక్రమణలు అనే విధంగా ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా చెరువులు తవ్వడం పరిపాటిగా మారింది. 20 నుండి 30 అడుగుల ఎత్తులో గట్లు వేస్తున్నారు. ఎకరం చేపల చెరువు లీజు ఏడాదికి లక్ష రూపాయలు పలుకుతోంది. కొల్లేరు వ్యాప్తంగా ఆరు నెలల నుండి అభయారణ్యంలో తవ్వకాలు పెరిగాయి. ఉంగుటూరు నియోజకవర్గం గణపవరం, నిడమర్రు మండలాలు, మల్లవరం, కైకలూరు నియోజకవర్గం పెదఎడ్లగాడ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద భీమవరానికి చెందిన కొంతమంది బడాబాబులు 300 ఎకరాలు, మండవల్లి మండలం పెనుమాక లంకలో 200 ఎకరాలు తవ్వేశారు. జనవరి నుండి నేటి వరకు 500 ఎకరాలకు పైగా తవ్వినట్టు స్థానికులు తెలుపుతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం కోసం భారీగానే ముడుపులు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే అటవీశాఖ అధికారులు పాతవాటి మరమ్మతులకు అవకాశం ఇస్తున్నామంటూ ముడుపుల వేటలో మునిగిపోయారు. గతంలో పనిచేసిన ఓ జిల్లా కలెక్టర్ 15,700 ఎకరాల్లో ఆక్రమణలు జరిగాయని జాతీయ హరిత ట్రిబ్యునల్‌కు నివేదిక ఇవ్వడంతో ఆ కలెక్టర్‌ను వెంటనే బదిలీ చేయడం జిల్లాలో సంచలనమైంది.

సుప్రీంకోర్టు ఉత్తర్వులు బుట్టదాఖలు

సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం కొల్లేరు అభయారణ్యంలో 5వ కాంటూరు పరిధిలో ఎలాంటి తవ్వకాలు జరపరాదు. అయినా బడాబాబులు వీటిని బేఖాతరు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకులే తవ్వకాలకు పాల్పడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యావరణ ప్రేమికులు, కొల్లేరు పరిరక్షణ సమితి అధికారులకు ఫిర్యాదు చేసినా మొక్కుబడిగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి. నియోజకవర్గ నాయకుల నుంచి గ్రామస్థాయి నాయకుల వరకు చెరువులు తవ్వుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. చెరువుల అక్రమ త్రవ్వకాలకు అధికార పార్టీ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను ప్రసన్నం చేసుకునేందుకు ద్వితీయ శ్రేణి నాయకులు కొల్లేరు సరస్సును ఆదాయవనరుగా మార్చుకుంటున్నారు.



అక్రమ చెరువులపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే...అది తమ పరిధిలో లేదని ఏలూరు, కైకలూరు రేంజ్ అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. పంట కాలువల పూడికతీతకు అనుమతి కోరితే నిరాకరించే అధికారులు...అక్రమ చెరువులకు అనుమతులు ఎలా ఇస్తున్నారని కొల్లేరు పరిరక్షణ సమితి నాయకులు ప్రశ్నిస్తున్నారు.

జిల్లా యంత్రాంగం ఇకనైనా దృష్టి సారించి జీవవైవిధ్యాన్ని కాపాడి కొల్లేరును పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే రాబోయే కాలంలో కొల్లేరు కనుమరుగై కొల్లేరు సరస్సు గురించి పుస్తకాలలో మాత్రమే చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

రోజుకో ఘోరం... ప్రతిచోటా టెర్రరిజం

ప్రభుత్వ తీరును విమర్శిస్తూ టీడీపీ అధినేత చంద్రబాబు ట్వీట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రోడ్డు వేయమని అడిగిన కానిస్టేబుల్ సస్పెన్షన్... పెన్షన్ అడిగిన మహిళపై కేసు... వస్త్ర వ్యాపారులపై వైసీపీ రౌడీల దాడి... ఇలా రోజుకో ఘోరం... ప్రతి చోటా ప్రభుత్వ టెర్రరిజం. ఇదీ రాష్ట్రంలో పరిస్థితి. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసు శాఖను వైసీపీ అనుబంధ విభాగంగా మార్చిన దుస్థితే ఈ పరిస్థితికి కారణమంటూ టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం ప్రభుత్వ తీరుపై ట్వీట్ చేశారు. బకాయిలు చెల్లించాలని కోరినందుకు ధర్మవరానికి చెందిన చేనేత వర్గ వస్త్ర వ్యాపారులపై విజయవాడలో వైసీపీ గూండాలు అమానుష దాడికి పాల్పడ్డారు. బాధితులను నగ్నంగా వీడియోలు తీసి వికృతానందం పొందారు. రోడ్డు వేయమని ఉపముఖ్యమంత్రిని అడిగిన పాపానికి చిత్తూరు జిల్లాలో దళిత వర్గానికి చెందిన కానిస్టేబుల్ పై కేసు పెట్టారు. తర్వాత సస్పెండ్ చేశారు. ప్రకాశం జిల్లాలో పింఛను డబ్బు అడిగిన వితంతు మహిళపై కేసు పెట్టారు. ఈ ప్రభుత్వానికి తమ పోకడలపై ప్రజలు ఏమనుకుంటారో అని లేదు... సమాజం గమనిస్తోందనీ లేదు. ఈ వైసీపీ ప్రభుత్వ పాపాలకు ప్రజలు తిరుగులేని గుణపాఠం చెప్పడం మాత్రం ఖాయమంటూ చంద్రబాబు హెచ్చరించారు.

1, 7, 9, 11 తరగతుల్లో నూరు శాతం నమోదుకు కార్యాచరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలలలో 1, 7, 9, 11వ తరగతుల్లో నూరుశాతం ప్రవేశాలకు పాఠశాల విద్యాశాఖ కార్యాచరణ రూపొందించింది. ఉపాధ్యాయులు, అధికారుల సమష్టిగా పనిచేయాలని విద్యాశాఖ సూచించింది. శాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ శనివారం సమీక్ష నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. '1, 7, 9, 11 తరగతుల్లో నూరు శాతం నమోదు కోసం ఈనెల 12, 19, 26 తేదీలను మిషన్ పల్స్ జీఈఆర్ రోజులుగా నిర్ణయించారు. కలెక్టర్ నుంచి వలంటీర్ల వరకు ప్రత్యేక అధికారులతో సహా అన్ని జిల్లాల అధికారులు పాఠశాలలో లేని ప్రతి బిడ్డనూ తిరిగి పాఠశాలకు తీసుకెళ్లడంతోపాటు అతని/ఆమె పేరు విద్యార్థి సమాచార పోర్టల్‌లో పొందుపర్చాలి. సురక్ష కార్యక్రమానికి సంబంధించి ఇంటింటికీ క్షేత్రస్థాయి బృందం వెళ్లాలి. 2006, సెప్టెంబరు 1 - 2018 ఆగస్టు 31 మధ్యకాలంలో జన్మించిన బిడ్డ పాఠశాలకు/ కళాశాలకు వెళ్తున్నారా? పోర్టల్‌లో వారి పేర్లు ఉందా? లేదా? అని ఆరా తీయాలి. అనకాపల్లి, ఎన్టీఆర్, అన్నమయ్య, నెల్లూరు, వైఎస్ఆర్ కడప జిల్లాల కలెక్టర్లు వచ్చే సమావేశానికి విద్యా కానుకపై ప్రజెంటేషన్‌కు సిద్ధమవ్వాలి' అని ప్రవీణ్ ప్రకాశ్ సూచనలు చేశారు.

వైఎస్సార్‌కు కాంగ్రెస్ నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో శనివారం విజయవాడ ఆంధ్రరత్న భవన్ నందు వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు నేతృత్వంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కేక్ కట్ చేసి రాష్ట్ర కమిటీ నాయకులకు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి రాష్ట్ర నాయకులు, కార్యకర్తలతో కలిసి గిడుగు రుద్రరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 2004లో అధికారంలో రావడానికి రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర ఒక మైలురాయని గుర్తు చేశారు. సంక్షేమం, అభివృద్ధికి మారుపేరుగా వైఎస్సార్ నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు, ఏఐసీసీ సభ్యులు వి.గురునాథం, ధనేకుల మురళి, లాం తాంతియా కుమారి, కొలనుకొండ శివాజీ, మీసాల రాజేశ్వరరావు, ఆర్టీఐ పీవై కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల లబ్ధికే ఉమ్మడి పౌరస్మృతి నాటకం

బీజేపీపై ముప్పాళ్ల, జేవీ విమర్శ

విశాలాంధ్ర- విశాఖ: కేంద్రంలో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ఉమ్మడి పౌరస్మృతిని బీజేపీ తెరపైకి తెచ్చిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి విమర్శించారు. విశాఖలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కర్నాటక ఎన్నికల్లో పరాభవం తరువాత బీజేపీ వెన్నులో చలి ప్రారంభమైందని, ఈ విషయాన్ని గ్రహించిన బీజేపీ నాయకత్వం ఎన్‌డీఏ పాతమిత్రుల కోసం ఆరాటపడుతోందని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా మణిపూర్‌లో కొనసాగుతున్న మారణకాండని ఆపలేని ప్రధాని మోదీ...ఉక్రెయిన్, రష్యా మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపుతాననడం విడ్డూరంగా ఉందని ముప్పాళ్ల, జేవీ ఎద్దేవా చేశారు. రాజ్యాంగ విలువల్ని మంట కలుపుతూ, భిన్నత్వంలో ఏకత్వాన్ని దెబ్బతీస్తూ...అబద్ధాలు, కుట్రలతో వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు మోదీ, షా ద్వయం కుట్రలు సాగిస్తోందని దుయ్యబట్టారు. తొమ్మిదిన్నరేళ్లలో చేసింది చెప్పుకోవడానికి లేక ఉమ్మడి పౌరస్మృతిని మళ్లీ తెరపైకి తెచ్చారని ఆక్షేపించారు. మణిపూర్ అల్లర్లపై అఖిలపక్షం ఏర్పాటు చేయకపోవడం దారుణమని విమర్శించారు. మణిపూర్‌లో బీజేపీ ముఖ్యమంత్రి ఒక పక్షానికి కొమ్ముకాస్తున్నా బీజేపీ అధినాయకత్వం అతనిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. విభజన హామీల అమలుపై గట్టిగా ప్రశ్నించలేని వైసీపీ ప్రభుత్వం...విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని కేంద్రం తెగనమ్ముతున్నా మాట్లాడటం లేదని విమర్శించారు. 22 మంది వైసీపీ ఎంపీలు ఒక్కసారి కూడా విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై లోక్‌సభలో మాట్లాడలేదన్నారు. ఫిబ్రవరి 9 నుంచి 22 వరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులను సందర్శించారని, జలాశయాల్లో పుష్కలంగా నీరు ఉన్నా పంట పొలాలకు సరఫరా చేయలేని పరిస్థితి ఉందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితిలో జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియాకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ప్రత్యర్థులమన్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాటకాలాడుతున్నాయని, వైసీపీ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శలు కూడా నాటకమేనని విమర్శించారు. రాష్ట్రానికి కేంద్రం లోపాయికారీగా సహకారం అందిస్తోందని చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కి రాష్ట్రంలోని సున్నపురాయి తదితర గనుల లీజులను రాష్ట్ర ప్రభుత్వం పొడిగించలేదని, దీన్ని బట్టి విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తున్నట్లు అర్థమవుతోందని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య వ్యవస్థను నిలబెట్టేందుకు, పోలీసుల అరాచకాలను నిలువరించేందుకు, ప్రాజెక్టుల నిర్మాణం కోసం, పోలవరం సత్వరమే పూర్తిచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడానికి, రాష్ట్రాన్ని రక్షించుకోవడం కోసం ఆగస్టు 16 నుంచి బస్సుయాత్ర తలపెట్టినట్టు తెలిపారు. ఈ యాత్ర కూర్మన్నపాలెంలో స్టీల్‌ప్లాంట్ కార్మికుల నిరసన శిబిరం నుంచి ప్రారంభమై సెప్టెంబర్ ఆరవ తేదీన తిరుపతిలో ముగుస్తుందని చెప్పారు. విలేకరుల సమావేశంలో సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సీఎన్ క్షేత్రపాల్ పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుకున్న విధంగా

ఓపీఎస్ అమలు చేయాలి

మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్వర్యంలో శనివారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా చేపట్టారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. ఇప్పుడు సీపీఎస్ స్థానంలో జీపీఎస్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. సీపీఎస్, జీపీఎస్ రెండు విధానాలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టదాయకమేనన్నారు. ఈ రెండింటిని వెంటనే ఉపసంహరించుకొని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దు చేసినప్పుడు ఇక్కడ ఎందుకు సాధ్యం కాదని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా సర్వీసు చేసి చివరిలో గంజినీళ్లు తాగమని చెబుతున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి మాట నిలబెట్టుకోకుంటే వచ్చే ఎన్నికలలో తగిన మూల్యం చెల్లించకోక తప్పదన్నారు. అవసరమైతే చలో దిల్లీ చేపట్టాలని పిలుపునిచ్చారు. ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సి.మరియ దాస్, మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టామన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అన్న జగన్‌మోహన్ రెడ్డి మాట మార్చారని, సీపీఎస్ రద్దు నాకొదిలేయండి అన్న వ్యక్తి, మమ్మలనే వదిలేయమంటున్నాడని, తన మ్యానిఫెస్టో భగవద్గీత, ఖురాన్, బైబిల్ అని చెప్పిన జగన్ ఇప్పుడు వాటినీ అవమానించేలా వ్యవహరించారని తెలిపారు. సీపీఎస్‌నే చిన్న మార్పు చేసి జీపీఎస్ అన్నారని, జీపీఎస్ వల్ల మాకు ఎటువంటి ఉపయోగం లేదన్నారు. జేఏసీ నాయకులు ఏవిధంగా అంగీకరించారో అర్థం కావడం లేదని, విధివిధానాలు రాకుండా బాగుందనే సర్టిఫికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఈ విధానాన్ని ఎట్టి పరిస్థితిలో ఒప్పుకోమన్నారు. వీరికి సంఘీభావం తెలపటానికి వచ్చిన ఉమ్మడి కృష్ణా జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, ఏపీటీఎఫ్ అధ్యక్షులు జి.హృదయరాజు మాట్లాడుతూ జీపీఎస్ విధానం ప్రభుత్వానికి మేలు చేస్తుంది తప్ప, ఉద్యోగులకు ఎలాంటి న్యాయం జరగదన్నారు. సీపీఎస్ ఉద్యోగుల పరిస్థితి పెనం మీది నుంచి పొయిలో పడిన చందంగా తయారైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. ఈ ధర్నాలో ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్జా నాగరాజు, కె.రాంప్రసాద్, మాగంటి శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, ఖాసీం, కృష్ణా జిల్లా అధ్యక్షులు కోట్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో

జనసేన బలమైన ముద్ర వేస్తుంది

విశాలాంధ్ర-మంగళగిరి: వారాహి విజయ యాత్రను దిగ్విజయం చేసేందుకు క్షేత్రస్థాయిలో పార్టీ అంతర్గత కమిటీల సభ్యులు చేసిన కృషి, పడిన కష్టం కళ్లారా చూశానని, ఈ పోరాటం వృధా కాదని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ బలమైన ముద్ర వేస్తుందని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. యాత్ర నిర్వహణకు ఏర్పాటు చేసిన కమిటీలతో ఆయన సమావేశమయ్యారు. యాత్ర తొలి విడతను విజయవంతం చేయడంలో భాగమైన కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. క్యాటరింగ్ కమిటీ, వాలంటీర్ కమిటీ, అకామిడేషన్ కమిటీ, మెడికల్ కమిటీ, మీడియా కోఆర్డినేషన్ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. శనివారం మంగళగిరి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ 'వారాహి విజయ యాత్ర కోసం నియమించిన ప్రతి కమిటీ క్షేత్రస్థాయిలో ఎంతో శ్రమకోర్చి పని చేసింది. మీ అందరి కృషి, సహకారాలతోనే తొలి విడత విజయవంతంగా ముగించగలిగాం. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న మలివిడత యాత్రను కూడా ఇదే పట్టుదలతో మనందరం కలిసి విజయవంతం చేద్దాం. వారాహి విజయ యాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తే ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో జనసేన బలమైన శక్తిగా ఉంటుంది' అని తెలిపారు. వైసీపీ విముక్త ఆంధ్ర ప్రదేశ్‌ను చూడాలంటే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా నుంచే వైసీపీ పతనం ప్రారంభం కావాలన్నారు. ఇక్కడ ప్రారంభమైతే అది రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తుందని, ప్రజాకంటక పాలన విముక్తి చేయడానికి మనం ఎంత బలంగా ముందుకు వెళితే రాష్ట్రానికి అంత మేలు అని అన్నారు. మీ కష్టం మరచిపోలేనిది, భవిష్యత్తులో మీ కష్టానికి తగ్గ గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ వారాహి యాత్ర ఒక స్ఫూర్తిదాయక ప్రస్థానమన్నారు. అంతా కలిసికట్టుగా పార్టీ కోసం ఒక చక్కటి కార్యక్రమం చేసుకోగలిగామని చెప్పారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

పరిష్కారం కాని కష్టజీవుల సమస్యలు: జల్లి విల్సన్

విశాలాంధ్ర-రాజమండ్రి: కష్టజీవులు, గ్రామీణ వ్యవసాయ కూలీల సమస్యలపై 90 సంవత్సరాలుగా పోరాడుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు బాపట్లలో సెప్టెంబర్ 15, 16,17 తేదీల్లో జరుగుతాయని, మహాసభలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లి విల్సన్ విజ్ఞప్తి చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో వ్యవసాయ కార్మికసంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల విస్తృతస్థాయి సమావేశం ఆలమూరు రామకృష్ణ అధ్యక్షతన శనివారం జరిగింది. జల్లి విల్సన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు గడిచినప్పటికీ ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో కష్టజీవుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా కష్టజీవులు పట్ల నిజమైన ప్రేమ చూపించడం లేదని, ఎన్నికల లబ్ధి కోసం మాత్రమే అరకొర పనులు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మిగులు భూమి చాలా ఉందని, దాన్ని సర్వే చేసి పేదలకు పంచాలని జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర మహాసభల నాటికి 26 జిల్లాల మహాసభలు, గ్రామసభలు పూర్తి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ పోరాట ఫలితంగా కోనేరు రంగారావు కమిటీ ఏర్పడిందని, దాని సిఫార్సులు అమలు చేయడంలో పాలకులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. జగనన్న ఇళ్ల నిర్మాణానికి ప్రతి లబ్ధిదారుడికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తున్న మోదీ సర్కారుపై దశల వారీ పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సీపీఐ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, కాకినాడ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి కొండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు కె.లక్ష్మణ్, రామచంద్రరావు, శీలం వెంకటేశ్, పార్టీ సీనియర్ నేతలు పి.సత్యనారాయణ, కేశవరం అప్పలరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి సునీల్ తదితరులు ప్రసంగించారు.

అలుపెరగని పోరాటయోధుడు

- మచిలీపట్నంలో శ్రీహరిరావు విగ్రహం నెలకొల్పాలి
- వర్ధంతి సభలో వక్తలు

విశాలాంధ్ర-మచిలీపట్నం: కమ్యూనిస్టు ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు మోదుమూడి శ్రీహరిరావు అని వక్తలు కొనియాడారు. జాతీయోద్యమ స్ఫూర్తి, సంఘ సంస్కరణ ప్రభావంతో విద్యార్థి దశలోనే రాజకీయాలలో అడుగుపెట్టిన ఆయన సుదీర్ఘ ప్రజాజీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. శనివారం స్థానిక భాస్కరపురంలో సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు నివాసంలో శ్రీహరిరావు 24వ వర్ధంతిని సీపీఐ పెడన పట్టణ కార్యదర్శి తుమ్మ చిన్న కొండయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీహరిరావు చిత్రపటానికి జిల్లా చేనేత సంఘం అధ్యక్షులు కోదాటి నారాయణరావు పూలమాల వేశారు. సీపీఐ జిల్లా ఇన్‌ఛార్జ్ కార్యదర్శి తాటిపర్తి తాతయ్య పాల్గొని మాట్లాడుతూ శ్రీహరిరావుతో పాటు ఆయన కుటుంబం కూడా పార్టీలో ఉండడం, పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను తన కుటుంబ సభ్యులకు కూడా నేర్పి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసి ఆయన సాధించిన ఘనతను కొనియాడారు. ఆ రోజుల్లో కాజా గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా సీపీఐ తరపున పని చేయాలని విద్యార్థులను చైతన్యపరిచేవారని తెలిపారు. శ్రీహరిరావు కమ్యూనిస్టు పార్టీ రాజ్యం రావాలని పరితపించిన వ్యక్తి అని అన్నారు. దాలిపర్తి కృష్ణమూర్తి మాట్లాడుతూ శ్రీహరిరావు ఒక ధన్యజీవని, నిస్వార్థమైన సేవకుడని, ఆయన పార్టీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. శ్రీహరిరావు శిలా విగ్రహాన్ని మచిలీపట్నంలో నిలబెట్టాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టా హేమ సుందరరావు మాట్లాడుతూ శ్రీహరిరావుతో కలిసి గ్రామగ్రామాన తిరుగుతూ పార్టీ పటిష్టత కోసం పని చేశామన్నారు. జై ఆంధ్ర ఉద్యమంలో కమ్యూనిస్టు నాయకులపై బాంబులు విసిరినప్పటికీ ఆయన భయపడలేదని గుర్తు చేశారు. మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు పమిడిముక్కల రాణి మాట్లాడుతూ శ్రీహరిరావు ఆశయ సాధన కోసం మనందరం కృషి చేయాలని, ప్రజల కోసం సీపీఐగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ మాట్లాడుతూ మహామనిషి శ్రీహరిరావు విగ్రహం మచిలీపట్నం నడిబొడ్డులో నిలబెట్టాలని అన్నారు. జిల్లా పార్టీ నిర్మాణానికి ఆయన చేసిన కృషి మరువ లేనిదని, ఆయన కుటుంబం కూడా నేటికీ పార్టీలో ముందుకు సాగడం అభినందనీయమని అన్నారు. సీపీఐ పెడన నియోజకవర్గ కార్యదర్శి పేరిశెట్టి ఉమాకాంతం మాట్లాడుతూ శ్రీహరిరావు చేనేత పరిశ్రమ మనుగడ కోసం పోరాటాలు చేశారని, ఆయన విగ్రహ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ధరల దెబ్బ... విద్యుత్ చార్జీల మోత

పాలకులకు షాక్ తప్పదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల హెచ్చరిక
- గుంటూరులో సీపీఐ శ్రేణుల వినూత్న నిరసన

విశాలాంధ్ర-గుంటూరు: రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరల దెబ్బ... పెరిగిన విద్యుత్ బిల్లులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విద్యుత్ షాక్ తగలడం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ హెచ్చరించారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, కూరగాయల ధరలు తగ్గించాలని, విద్యుత్ చార్జీలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అధ్వర్యంలో గుంటూరు శంకర్ విలాస్ సెంటర్‌లో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయల దండలు మెడలో వేసుకుని, టేబుల్ ఫ్యాన్‌ను చేతపట్టుకుని, టీవీకి పూలదండ వేసి వినూత్న నిరసన తెలియజేశారు. అనంతరం జంగాల అజయ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ధరలు తగ్గిస్తామని కేంద్రంలోని నరేంద్ర మోదీ, రాష్ట్రంలోని జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ప్రతి వేదికపై ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారని గుర్తుచేశారు. ఎన్నికలయిన తరువాత ఏరుదాటాక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తూ ఇచ్చిన వాగ్దానాన్ని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎన్డీయే ప్రభుత్వం ఎన్నిసార్లు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచిందో లెక్కేలేదన్నారు. వాటి ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై పడి తినడానికి తిండి లేదు... కొందామంటే కొరివైపోయింది అనేలా సామాన్యుల పరిస్థితి ఉందని అన్నారు. టమాటా, మిర్చి, బియ్యం, పప్పు ఇలా చెప్పుకుంటూ పోతే పెరిగిన ధరలతో రోజువారి రూ.1,500 సంపాదించినా సరిపోయేలా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నొక్కుతున్న బటన్‌తో వచ్చే డబ్బు విద్యుత్ చార్జీలు చెల్లించడానికి... ఉప్పు, పప్పు కొనుగోలుకు సరిపోవడం లేదని విమర్శించారు. ఇది చాలదన్నట్లు ట్రూఅప్ చార్జీల పేరుతో ఇంటి యజమానికి, అద్దెదారుడికి తగాదాలు పెడుతున్నారని మండిపడ్డారు. 2014లో వినియోగించుకున్న విద్యుత్‌కు ఇప్పుడు బిల్లు చెల్లించాలనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యుత్ జోలికి వచ్చిన ఈ ప్రభుత్వానికి విద్యుత్ షాక్ తగలడం ఖాయమని, రాబోయే రోజులలో విద్యుత్ చార్జీల బాధితులు వైసీపీ ప్రభుత్వాన్ని నేలకూల్చుతారని హెచ్చరించారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాకంటక పాలన సాగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర ధరలతో సామాన్యుల కొనుగోలు శక్తి పడిపోయిందని, టమాటా ధర రూ.100 దాటి పోవడంతో దిక్కుతోచని స్థితిలో ప్రజలు ఉన్నారన్నారు. తక్షణమే ప్రభుత్వాలు ధరల నియంత్రణకు చర్యలు తీసుకుని నిత్యావసర సరుకులను ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఒక వైపు విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరొవైపు ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్నారని, ఇది సరైంది కాదని తక్షణమే ట్రూఅప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కమిటీ సభ్యులు ఆకిటి అరుణ్‌కుమార్, జి.సురేష్‌బాబు, రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, యశ్వంత్, మహ్మద్ జైద్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, సీపీఐ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, బీవీఆర్, చైతన్య, రామ్‌ప్రసాద్, దూపాటి వెంకటరత్నం, ఎస్.కె.వలి, జగన్నాథం, చంద్రమౌళి, యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

- రాష్ట్ర వ్యాప్తంగా జయంతి వేడుకలు
- ఇడుపులపాయలో వేర్వేరుగా షర్మిల, జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. అన్ని జిల్లాల్లోనూ వైసీపీ శ్రేణులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించారు. సీఎం జగన్, వైఎస్ భారతితో కలిసి వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయకు మధ్యాహ్నం చేరుకుని తన తండ్రికి నివాళులర్పించారు. అంతకుముందు ఉదయం వైఎస్సార్‌కు వైఎస్ షర్మిల, వైఎస్ విజయలక్ష్మి శ్రద్ధాంజలి ఘటించారు. అన్ని జిల్లా పార్టీ కేంద్ర కార్యాలయాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు వైసీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు హాజరయ్యారు. పార్టీ నేతలు కేక్‌ను కట్ చేసి పరస్పరం తినిపించుకున్నారు.

వైఎస్‌ను తెలుగు ప్రజలు మరువలేరు: సజ్జల

వైఎస్సార్‌ను తెలుగు ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని, ఆయన ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్ పని చేస్తున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఆయన ప్రతి లక్షణాన్ని సీఎం జగన్ పుణికిపుచ్చుకున్నారని కొనియాడారు. ఏ సర్వే చూసినా 70 నుంచి 80 శాతం మంది ప్రజలు జగనే రావాలని కోరుకుంటున్నారని వివరించారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు ఏం చేశారో చెప్పుకోలేని దుస్థితి నెలకొందన్నారు. ఈ వేడుకల్లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్, ఎమ్మెల్సీలు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, లేళ్ల అప్పిరెడ్డి, వైసీపీ నేతలు, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

సీఎం భావోద్వేగ ట్వీట్

'మీ స్ఫూర్తి చేయిపట్టి నడిపిస్తోందని నాన్నా' అంటూ వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని సీఎం భావోద్వేగంతో ట్వీట్ చేశారు. 'వైఎస్సార్ అనే పదం వినగానే స్వచ్ఛమైన చిరునవ్వు మన ముందు సాక్షాత్కరిస్తుంది. నమస్తే అక్కయ్య, నమస్తే చెల్లెమ్మా, నమస్తే తమ్ముడు అని ఆప్యాయంగా పిలిచే పిలుపు మన చెవిలో ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఒక అడుగు వేస్తే, ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నాలుగడుగులు వేస్తున్నారు. మీ జయంతి మాకందరికీ ఒక పండుగ రోజు అని' సీఎం ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

సంపాదకీయం

భూ పంపిణీ పేర లూటీ

దాదాపు నాలుగేళ్ల కింద జమ్ము-కశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసినప్పటి నుంచి అక్కడ శాంతి భద్రతలు ఎంత మేర మెరుగయ్యాయో, తీవ్రవాదం ఎంతవరకుతగ్గిందో తెలియదు. తీవ్రవాదానికి సంబంధించిన సంఘటనల వివరాలేవీ గత నాలుగేళ్లుగా మునుపటంత తరచుగా బయటికి రావడం లేదు. అక్కడి సమాచారం స్వేచ్ఛగా వెల్లడి కావడంలేదు. అలాగని కశ్మీర్‌లో తీవ్రవాదం తగ్గిపోయిందనుకోవడానికీ లేదు. ఎందుకంటే అదే నిజమైతే సందర్భం లేకపోయినా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్ మీద విరుచుకుపడవలసిన అవసరమే ఉండేది కాదు. బీజేపీ ప్రభుత్వాన్ని పాకిస్తాన్ బూచి ఇంకా వెంటాడుతోందంటే బలమైన కారణం ఏదో ఉండి ఉండాలి. కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడానికి, ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టడానికి సంబంధించి పార్లమెంటులో బిల్లు ప్రతిపాదిస్తున్న సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన ప్రకటన గుర్తుకు తెచ్చుకుంటే రాష్ట్రంగా ఉన్న కశ్మీర్ స్థాయిని ఎందుకు దిగజార్చవలసి వచ్చిందో, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడదీయవలసి వచ్చిందో కొంతమేరకైనా అర్థం అవుతుంది. ఆ బిల్లు ప్రతిపాదించిన సమయంలో అమిత్ షా కాశ్మీర్‌లో అభివృద్ధి కుంటుపడినందువల్ల అక్కడ భూములు కారుచౌక అన్నారు. అంటే భూముల ధరలు అంతకంతకూ ప్రియంకావడం అభివృద్ధికి సూచిక అనుకోవాలేమో. జమ్ము-కశ్మీర్‌లో ముఖ్యంగా కశ్మీర్ లోయలో ముస్లింలు అధిక సంఖ్యాకులుగా ఉండడం బీజేపీ ఎన్నడూ సహించలేదు. ఆ కారణంగానే 370వ అధికరణం రద్దు చేయాలని భారతీయ జనతా పార్టీకి పూర్వ రూపమైన భారతీయ జనసంఘ్ రోజుల నుంచీ సంఘ్‌పరివార్ కోరుతూనేఉంది. ప్రత్యేక ప్రతిపత్తి ఉన్న రాష్ట్రం జమ్ము-కశ్మీర్ ఒక్కటే అయినట్టు బీజేపీ నాయకులు ప్రచారం చేస్తూ ఉంటారు. ఏదో ఒక మేర అనేక రాష్ట్రాలకు కొన్ని విషయాల్లో ప్రత్యేక సదుపాయాలు లేకపోలేదు. ఆ అంశాన్ని వీలైనంత మేరకు మరుగుపరుస్తూ ఉంటారు. కశ్మీర్‌లో దశాబ్దాలుగా తీవ్రవాదం తాండవిస్తున్నా అక్కడి మానవాభివృద్ధి సూచికలు అనేక రాష్ట్రాలకన్నా మెరుగ్గా ఉన్నాయి. ప్రశాంతతకు భంగం కలగకుండా ఉంటే మరింత ముందడుగు వేసిఉండేది. 370వ అధికరణం రద్దుచేసిన తరవాత మానవాభివృద్ధి సూచికల్లో గణనీయమైన పెరుగుదలవల్ల ఆ ప్రాంత రూపురేఖలు మారిపోయాయని, అక్కడి ప్రజలు సిరిసంపదలతో తులతూగుతున్నారనడానికి ఏ రకమైన దాఖలాలూ లేవు. అభివృద్ధి అంటే భూమి లాంటి వనరుల ధరలు పెరిగిపోవాలనుకునేచోట మరో ప్రశ్నకు అవకాశమే ఉండదు. ప్రజల జీవన ప్రమాణాల్లో, స్థితిగతుల్లో మెరుగుదలే అభివృద్ధికి సూచిక అని అంగీకరించనప్పుడు అసలైన అభివృద్ధి గురించి ఏం చెప్పినా దండగే. కశ్మీర్ ప్రజలను జనజీవన స్రవంతిలో కలిసేటట్టు చేస్తామని మోదీ ప్రభుత్వం ఊదరగొట్టింది. అందుకే 370వ అధికరణాన్ని రద్దు చేస్తున్నామని, ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొడ్తున్నామని మోదీ, అమిత్ షా ద్వయం నిర్విరామంగా చెప్తూనే ఉన్నారు. మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడు బీజేపీకి సొంతంగా సంపూర్ణమైన మెజారిటీ వచ్చినందువల్ల కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేయడానికి అదనపు అవకాశం వచ్చింది. ఈ ప్రయత్నాల వెనక ఆంతర్యం ఏమిటో ఇప్పుడిప్పుడే బయట పడ్తోంది. మోదీ సర్కారు దృష్టిలో అభివృద్ధి అంటే అభివృద్ధి చెందాయనుకుంటున్న రాష్ట్రాలలో ఉన్న అవకతవకలు, ప్రజా వ్యతిరేక పరిణామాలు మిగతా చోట్లను కూడా ఆవరించడమే. కశ్మీర్ లోయలో ముస్లిం జనాభా అధికం కనక అక్కడి జనాభా స్వరూపాన్ని మార్చాలని బీజేపీ ఎప్పటి నుంచో కలలు కంటోంది. ఇప్పుడు ఆ ప్రణాళికను అమలులో పెడ్తోంది.

ఈ ఉద్దేశంతోనే జమ్ము కశ్మీర్‌లో "భూమి లేని వారికి భూమి" అన్న పథకం అమలు చేస్తున్నారు. భూమి పంపకం పేర ఇతర ప్రాంతాల నుంచి వలసలను ప్రోత్సహించి వారిని భూమిలేని వారిగా పరిగణించి వారికి భూమిపంపిణీ చేయాలని ప్రయత్నిస్తున్నారు. దాదాపు పదిలక్షల మంది వలస వచ్చేట్టు చేయాలని అనుకుంటున్నారు. తాము వలసలను ప్రోత్సహించాం, భూ వసతి కల్పించాం కనక ప్రయోజనం పొందిన వారు తమకు విశ్వాస పాత్రులుగా ఉండక ఏం చేస్తారు అన్నది బీజేపీ మనసులోమాట. అంటే వీరందరినీ తమ ఓటు బ్యాంకుగా మలుచుకునే ప్రయత్నం అంటే ఇదే. ముస్లింలకు వసతులు కల్పించడాన్ని, వారి అభివృద్ధికి సానుకూల చర్యలు తీసుకోవడాన్ని ముస్లింలను సంతృప్తి పరచడం అనీ, ఇది ఓటు బ్యాంకు రాజకీయం అని ఇంతకాలం వాదించిన బీజేపీ ఇప్పుడు అవే ఓటుబ్యాంకు రాజకీయాలను ఆశ్రయిస్తోంది. ఒక్కటే తేడా. ఇదివరకు ముస్లింలు ఉన్నారంటున్న స్థానంలో ఇప్పుడు హిందువులు ఉంటారు. హిందువులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తే అది బీజేపీ దృష్టిలో ఓటుబ్యాంకు రాజకీయం కాదు. జమ్ము-కశ్మీర్ లో భూమిలేని ఒక్కొక్క కుటుంబానికి 126 చదరపు మీటర్ల భూమి కేటాయించాలని జూన్ 21నే కశ్మీర్ పాలనావిభాగం నిర్ణయించేసింది. ఈ విషయం జమ్ము-కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా గత మూడోతేదీన ప్రకటించారు. జమ్ము-కశ్మీర్‌లో ఇల్లులేని కుటుంబాలు 2.57 లక్షలు ఉన్నాయని 2011 నాటి సామాజిక ఆర్థిక, కుల గణనలో తేలిందట. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఈ లెక్కలు సేకరించారు. ఈ సాంఘిక సంక్షేమ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రారంభించింది. 2018 జనవరి నుంచి 2019 మార్చి మధ్యలో రెండోసారి సర్వే జరిగింది. మొదటిసారి సర్వేలో చేరనివారిని ఈ సర్వే ద్వారా గుర్తించారు. 2019లో 2.65 లక్షల కుటుంబాలకు ఇళ్లు లేవని గుర్తించారు. 63, 426 మందికి ఇళ్లు కేటాయించారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన దానికన్నా నాలుగు రెట్లు ఎక్కువ భూమి కశ్మీర్ పాలనాయంత్రాంగం కేటాయించిందట. అయితే 2021 నాటి నివేదిక ప్రకారం జమ్ము-కశ్మీర్‌లో ఇళ్లులేని వారు కేవలం 19,047 అని మాజీ ముఖ్యమంత్రి, పి.డి.పి. నాయకురాలు మెహబూబా ముఫ్తీ వాదిస్తున్నారు. అంతకన్నా ఎక్కువ మందికి ఇళ్ల స్థలాలు కేటాయించడం అంటే ఆ ప్రాంతానికి చెందని వారికి సదుపాయాలు కల్పించివారు అక్కడ స్థిరపడేట్టుచేసి జనాభా స్వరూపాన్ని మార్చే ప్రయత్నం చేయడమే. మెహబూబా చెప్పిన లెక్కలు 2021లో పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం వెల్లడించినవే. కశ్మీరీల గుర్తింపును సవాలుచేసే ఏ చర్యనైనా ప్రతిఘటిస్తామని మెహబూబా హెచ్చరించారు. 370వ అధికరణాన్ని రద్దు చేసిన తరవాత ప్రత్యేక ప్రతిపత్తి లేకుండా పోయింది కనక అక్కడి వనరులను, భూమిని, ఉపాధి అవకాశాలను లూటీచేసే ప్రయత్నం తీవ్రంగా సాగుతోంది.

రాజస్థాన్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐక్యపోరు

సుశీల్‌కుట్టి

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ ఐక్యంగా పోరాడేందుకే నిర్ణయించుకుంది. ప్రస్తుత ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్, మాజీ ఉపముఖ్య మంత్రి రాజేష్‌పైలెట్ మధ్య వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖడ్గే, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీల కృషితో ఇద్దరిమధ్య సయోధ్య కుదిరింది. పైలెట్‌మాత్రం మల్లిఖార్జున్ ఖడ్గే రాహుల్‌ను కలవగా, గెహ్లాత్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ రాజస్థాన్‌ను పరిపాలిస్తున్నారు. అనుకూల వాతావరణం కాంగ్రెస్‌కేఉన్నదని వార్తలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇద్దరు నాయకులు ఐక్యంగా కృషిచేయాలని, భిన్నంగా వ్యవహరిస్తే తీవ్రమైన చర్యలుంటాయని ఖడ్గే, రాహుల్ హెచ్చరించారు. పైలెట్‌తో కలిసి పనిచేసేందుకు గెహ్లాత్ అంగీకరించారు. అలాగే పైలెట్ కూడా గెహ్లాత్‌తో కలిసి అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడమే కాక పార్లమెంటు ఎన్నికల్లోనూ అత్యధిక ఎంపీ సీట్లు గెలవడానికి కృషి చేస్తామన్నారు. ఈ ఏడాది చివరిలో మొత్తం ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఐదు రాష్ట్రాల్లో రాజస్థాన్, చత్తీస్‌ఘర్‌లు కూడా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లో బీజేపీ ద్వితీయశ్రేణి నాయకుడు ఆదివాసీలకు చెందిన వ్యక్తిపై మూత్రవిసర్జన చేయడంతో బీజేపీ తీవ్ర ఇబ్బందుల్లో పడుతుందని గ్రహించిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చౌహాన్ బాధితుడిని స్వయంగా పిలిచి కాళ్లు కడిగి తలపై చల్లుకున్నారు. ఇదంతా బీజేపీ నాటకీయంగా పనిచేస్తోందని విమర్శలు వచ్చాయి. బాధితుడికి ఆర్థిక సహాయం కూడా ముఖ్యమంత్రి ప్రకటించారు. అయినప్పటికీ బీజేపీకి వచ్చిన చెడ్డపేరు అంత త్వరగా సమసిపోయేది కాదు. బీజేపీ నాయకుడి చర్యతో ఆదివాసీలంతా ఆ పార్టీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వీరంతా ఈసారి కాంగ్రెస్‌కు ఓటుచేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. గత ఎన్నికల్లోనూ కాంగ్రెస్ గెలిచిన తర్వాత ఆ పార్టీలోని ఎంఎల్‌ఏలను బీజేపీ నాయకత్వం అనేక విధాలుగా ప్రయత్నించి కొంతమంది కాంగ్రెస్ ఎంఎల్‌ఏలను తమవైపు తిప్పుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రాజస్థాన్‌లో ఒక పార్టీ గెలిస్తే రెండవ పార్టీ ఓడిపోతుంది. ఈ విధంగా కాంగ్రెస్, ఆ తర్వాత బీజేపీలు అధికారాన్ని చేపడుతున్నాయి. అయితే ఈ సారి పరిస్థితి మారిందని విశ్లేషకులు అంచనా వేశారు. పైగా బీజేపీలో మూడు గ్రూపులు ఏర్పడటం ఆ పార్టీకి పెద్దలోపంగా కనిపిస్తోంది. తొమ్మిదేళ్లకుపైగా కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానిగా పాలన సాగుతోంది. ఈ కాలంలో గుజరాత్‌ను కూడా ఢిల్లీనుంచే మోదీ పరిపాలిస్తున్నాడని అన్నిచోట్లా ఓటర్లు భావిస్తున్నారు. అందువల్ల అటు మధ్యప్రదేశ్‌లోనూ, ఇటు రాజస్థాన్‌లోనూ బీజేపీపై బాగా వ్యతిరేకత ఏర్పడిందని అంచనాలు వస్తున్నాయి.

రాజస్థాన్‌లో ఇరువురునేతలు ఐక్యంగా పనిచేసేందుకు ఎన్నికలు అయిపోయేవరకు ఆ పార్టీ అధిష్టానవర్గం దృష్టిపెట్టి ఉండనుంది. ఒకవేళ ఇరువురునాయకులు కలిసి పనిచేయకపోతే ఈసారి తగినచర్యలు తీసుకునేందుకు అధిష్టానవర్గం వెనుకాడబోదని తెలుస్తోంది. ఐక్యంగా పనిచేస్తే గెలుపు సాధ్యమని కాంగ్రెస్ గట్టిగా విశ్వసిస్తోంది. ఢిల్లీలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఇద్దరిమధ్య కుదిర్చిన సయోధ్య కొనసాగే సూచనలే కనిపిస్తున్నాయి. పైలెట్, గెహ్లాత్‌లతో దాదాపు నాలుగుగంటలపాటు చర్చలు జరిపారు. ఎట్టకేలకు ఇద్దరిమధ్య సయోధ్య కుదిరిందని ఇక గెలుపు తమదేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, రాజస్థాన్ ఇన్‌ఛార్జి కెసి వేణుగోపాల్ ప్రకటించారు. ఇరువురునాయకులు కాంగ్రెస్ అవకాశాలను ఎటువంటి పరిస్థితుల్లోనూ దెబ్బతీయబోరని ఆయనఅన్నారు. నరేంద్రమోదీ రాజస్థాన్‌లో ఇప్పటికే ఒక్కసారి పర్యటించి మూడుగ్రూపుల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించినా ఫలించ లేదని వార్తలు వచ్చాయి. పార్టీ కార్యకలాపాలకు దూరంగాఉన్న వసుంధర రాజెను బుజ్జగించేందుకు మోదీ ప్రయత్నించారు. అయినప్పటికీ బీజేపీ అక్కడ ఐక్యంగా కృషిచేసే అవకాశం కనిపించడంలేదు. మోదీ మాత్రం అనేక పర్యాయాలు రాష్ట్రంలో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరిగేవరకు మోదీ వివిధ రాష్ట్రాలలో పర్యటించి ప్రచారం చేయడానికే శ్రీకారంచుట్టారు. ఇప్పటికే ఆయన తెలంగాణ, మధ్యప్రదేశ్ లలో పర్యటించారు. రాజస్థాన్‌లో పార్టీపైన పూర్తిఅదుపు కలిగిఉన్నామని బీజేపీ భావిస్తోంది. ముఖ్యమంత్రి అభ్యర్థులను ప్రకటించకుండా రాజస్థాన్‌లో కాంగ్రెస్ ఎన్నికల్లో పాల్గొంటుంది. చాలా కాలంగా పైలెట్ వసుంధరరాజె ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో అవినీతికి పాల్పడ్డారని ఈ వ్యవహారంలో కేసు నమోదుచేసి విచారణజరిపి శిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నారు. ఆమె కాలంలో ప్రశ్నాపత్రాలను లీక్ చేయడంద్వారా అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. రానున్న రోజుల్లో రాజస్థాన్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను సంస్కరించేందుకు గెహ్లాత్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదిస్తుందని, ప్రశ్నాపత్రాలను లీక్‌చేసిన వారిపై కఠిన శిక్షలు అమలు జరుపుతుందని వేణుగోపాల్ ప్రకటించారు. ఈ అంశమే ఇరువురి మధ్య సయోధ్యకు దారితీసిందని తెలుస్తోంది. అధిష్టానవర్గం అజమాయిషీలో ఇరువురు నాయకులు కలిసి పనిచేసేందుకు అంగీకరించడం మంచి పరిణామమని వేణుగోపాల్ అన్నారు.

ధృతరాష్ట్ర కౌగిలి

భారత రాజకీయ వ్యవస్థలో ప్రాంతీయ పార్టీలకు విశిష్టత ఉంది. ఈ పార్టీలు స్థానికంగా, రాష్ట్ర స్థాయిలో కడకు జాతీయ స్థాయిలో గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయి. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటులో కూడా కీలకమైన భూమిక నిర్వహించాయి. ప్రాంతీయ పార్టీలకు అస్తిత్వం లేకుండా చేయడానికి ప్రధానమంత్రి మోదీ నిరంతరం ప్రయత్నిస్తున్నారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ప్రాంతీయ పార్టీలకు ప్రాముఖ్యతే లేకుండా పోయింది. ప్రస్తుతం మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలన్న ప్రయత్నాలు ముమ్మరమైన స్థితిలో ప్రాంతీయ పార్టీలు అస్తిత్వాన్ని చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. వాటిని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు కూడా మోదీ అంతే తీవ్రంచేశారు. మోదీకి ఉన్న మరో లక్షణం మిత్రపక్షాలను సైతం సహించలేక పోవడం. అందుకే శివసేన, అకాలీదళ్, బిజూ జనతాదళ్, జె.డి.(యు) లాంటి పార్టీలు క్రమంగా ఎన్.డి.ఎ.కు దూరమయ్యాయి.

గత ఏడాది ఏక్‌నాథ్ షిండేను అడ్డం పెట్టుకుని శివసేనను నిట్టనిలువునా చీల్చేశారు. అయినా శివసేన నాయకుడు బాల్‌ఠాక్రే కుమారుడు ఉద్ధవ్ ఠాక్రేకు జనాదరణ తగ్గలేదు. కిందటి వారంలోనే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్.సి.పి.) నాయకుడు శరద్ పవార్ సోదరుడి కుమారుడు అజిత్ పవార్‌ను ఉపయోగించుకుని ఆ పార్టీని కూడా బీజేపీ చీల్చేసింది. ఏక్‌నాథ్ షిండేతో అవసరం తీరిపోయింది కనక ఆయనను ఒంటరినిచేసే ప్రయత్నం సాగుతోంది. మోదీ అనుసరిస్తున్న ఈ వైఖరికి మూల కారకుడు బీజేపీలో అత్యంత సీనియర్ నాయకుడు ఎల్.కె.అద్వానీ. ఆయన రెండు పార్టీల వ్యవస్థ గురించి తరచూ ప్రస్తావించేవారు. కానీ అద్వానీ అవసరంలేనిస్థితికి చేరుకున్న మోదీఇప్పుడు అద్వానీ పేరైనా ప్రస్తావించరు. కృతజ్ఞత లేకపోవడంలో మోదీ తరవాతే మరెవరి పేరైనా చెప్పాలి. రెండు పార్టీల వ్యవస్థ కావాలని మోదీ ఒక్కసారైనా అనలేదు కాని ఆయన ఆంతర్యం అదే. మిగతా ఒక్కపార్టీ కూడా ఎంత బలహీనంగాఉంటే అంతమంచిదని మోదీ అనుకుంటారు.

ప్రాంతీయ పార్టీలను అవసరమైనప్పుడు వినియోగించుకుని తరువాత దూరం విసిరేయడం మోదీ నైజం. 2014లో మోదీ మొదటిసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు బీజేపీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ.లో దాదాపు రెండు డజన్ల రాజకీయపార్టీలు ఉండేవి. దీర్ఘకాలం బీజేపీతో కలిసి నడిచిన అకాలీదళ్, కశ్మీర్‌లోని పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ(పి.డి.పి.), తెలుగుదేశం లాంటివాటిని మోదీ వదిలించుకోవడమో, ఆయన వైఖరిని గమనించి ఆ పార్టీలే దూరంగా ఉండడమో గమనిస్తూనే ఉన్నాం. టి.డి.పి. బీజేపీని బుజాన వేసుకున్న దశలో కూడా చంద్రబాబు నాయుడును కలుసుకునే కనీస మర్యాదకూడా మోదీ పాటించలేదు.

2019 సార్వత్రిక ఎన్నికలలో శివసేన, రాంవిలాస్ పాశ్వాన్ నాయకత్వంలోని లోక్ జనశక్తి (ఎల్.జె.పి.), అకాలీ దళ్, నితీశ్ కుమార్ నేతృత్వంలోని జె.డి.(యు), అప్నాదళ్, అఖిల జార్ఖండ్ విద్యార్థి సంఘం ఎన్.డి.ఎ. కూటమిలో ఉండేవి. రెండేళ్లయినా తిరగక ముందే శివసేన, అకాలీదళ్, ఎల్.జె.పి. లాంటివి ఎన్.డి.ఎ. తో తెగతెంపులు చేసుకున్నాయి.

ఆ తరవాత బిహార్‌లో జె.డి.(యు) నాయకుడు నితీశ్ బీజేపీకి సలాం కొట్టేశారు. అధికారంలోకి వచ్చేదాకా ప్రాంతీయంగా బలం ఉన్న పార్టీలను చేరదీసి అవసరం తీరిన తరవాత వదిలించుకోవడం ప్రపంచమంతటా ఉన్నదే.

అయితే బీజేపీ చేతిలో దెబ్బతిన్న ప్రాంతీయ పార్టీలన్నీ మిన్నకుండి పోతాయనుకోలేం. ఉదాహరణకు ఎప్పటినుంచో బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేన బీజేపీపై తిరుగుబాటు చేసింది. అంతవరకు ప్రత్యర్థులుగా ఉన్న ఎన్.సి.పి., కాంగ్రెస్‌తో కలిసి మహా ఘట్‌బంధన్ ఏర్పాటుచేసి అధికారంలోకి కూడావచ్చింది. ఏడాది కింద శివసేనను కూడా షిండే సహాయంతో మోదీ, అమిత్ షా ద్వయం చీల్చేసింది. ఒకప్పుడు బీజేపీకి మహారాష్ట్రలో డిపాజిట్లు దక్కడం కూడా గొప్ప విజయంగా ఉండేది. అలాంటిది శివసేనతో మైత్రి తరవాత కాలు మోపడానికి సందు సంపాదించిన బీజేపీ తరవాత అతి పెద్దపార్టీగా అవతరించింది. ఎన్.డి.ఎ.తో కలిసి ఉన్న పాతికేళ్లు వృథా అయినాయని ఉద్ధవ్ వ్యాఖ్యానించారు. దీన్నిబట్టి మోదీ ధృతరాష్ట్ర కౌగిలిలో ఊపిరాడనిస్థితి ఎంత ఘోరంగా ఉంటుందో ఊహించుకోవచ్చు.

శివసేన లాగా బీజేపీని వదిలించుకునే సాహసం చేయలేని అకాలీదళ్ హీనమైన స్థితిలోకి దిగజారింది. వందేళ్ల పైబడి చరిత్రఉన్న అకాలీదళ్ అస్తిత్వమే అనుమానాస్పదమైంది. మోదీని గుడ్డిగా సమర్థించడమే అకాలీదళ్ బలహీన పడడానికి కారణం. ఒకప్పుడు పంజాబీ సూబా కోసం జరిగిన పోరాటంలో, రైతుల ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన అకాలీదళ్ ఇప్పుడు పంజాబ్ రాజకీయాలలో నాలుగో, అయిదో స్థానానికి దిగజారింది. లోక్‌జనశక్తి నాయకుడు రాంవిలాస్ పాశ్వాన్ చాలాకాలం మోదీకి అంటకాగారు. మోదీ విచ్ఛిన్నకర విధానాలను గుడ్డిగా సమర్థించారు. పాశ్వాన్ మృతి తరవాత ఆయన కుమారుడు చిరాగ్ పాశ్వాన్‌ను బీజేపీ దుర్మార్గంగా అవమానించింది. పాశ్వాన్ మద్దతుదార్లను ఏకంగా కబళించాలనుకుంది. చిరాగ్ పాశ్వాన్ బాబాయి పశుపతి నాథ్ పారస్‌ను పావుగా ఉపయోగించి ఎల్.జె.పి.ని చీల్చింది. కశ్మీర్‌లో ముఫ్తి మహమ్మద్ సయీద్ నాయకత్వంలోని పి.డి.పి.తో మూడేళ్లపాటు బీజేపీ స్నేహంచేసింది. జనాకర్షణ ఉందనుకున్న మోదీతో మైత్రివల్ల కశ్మీర్ సమస్య కొలిక్కి వస్తుందని ముఫ్తీఆశించారు. ఆ తరవాత ఆయన కూతురు మెహబూబాముఫ్తీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీజేపీ కొంత కాలానికే మద్దతు ఉపసంహ రించింది. బీజేపీ అసలుఉద్దేశం కశ్మీర్‌లో కాలుమోపడమే. ఆ తరవాత కాశ్మీర్ అస్తిత్వాన్నే కాజేయడానికి 370వ అధికరణాన్ని రద్దుచేసింది. జమ్ము-కశ్మీర్ ను మోదీ ప్రభుత్వం రెండుముక్కలు చూసింది. ఏళ్లు గడిచినా కశ్మీర్‌లో ప్రశాంతత ఇప్పటికీ ఏండమావే.

బీజేపీతో స్నేహం బిహార్‌లో నితీశ్‌కు కొంతకాలం ముఖ్యమంత్రి పదవి దక్కేట్టు చేసిఉండొచ్చు కానీ ఈ లోగా బీజేపీ కుత్సితానికి జె.డి. (యు) బలహీనపడింది. బీజేపీతో కలిసి నితీశ్ ప్రభుత్వం ఏర్పాటుచేసినప్పుడు జె.డి.(యు)కు 74 మంది ఎమ్మెల్యేలు ఉంటే ఆ తరవాత ఆ సంఖ్య 45 కు తగ్గింది. బీజేపీతో కొనసాగితే అసలుకే ముప్పు అని గ్రహించిన నితీశ్ తెగతెంపులు చేసుకుని ఆర్.జె.డి.తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. లేకపోతే నితీశ్ కూడా ధృతరాష్ట్ర కౌగిలిలో నలిగిపోయేవారు. కీలుబొమ్మ ముఖ్యమంత్రిగా ఉంటే ఎంత ప్రమాదమో నితీశ్ సమయానికి గ్రహించి బతికిపోయారు.

జె.డి.(యు)తో కలిసి ఉన్నప్పుడు బీజేపీ అధికారంలో ఉంటూనే ప్రతిపక్ష పాత్ర పోషించేది. ఒరిస్సాలో కూడా నవీన్ పట్నాయక్ నాయకత్వంలోని బి.జె.డి.నీ కుదేలు చేయాలన్నది ఇప్పటికీ బీజేపీ ఆశ.

మొదటి దశలో సంపూర్ణమైన మెజారిటీ లేదు కనక బీజేపీకి ప్రాంతీయ పార్టీల అవసరంఉన్నా అంతరాంతరాల్లో వాటిని కబళించే దుశ్చింత ఉండనే ఉంది. ఇప్పుడు పూర్తి మెజారిటీ ఉన్నా రాజ్యసభలో ఇతర పార్టీల అవసరం ఉంది. కాంగ్రెస్ ముక్త్ భారత్ నినాదంతో ప్రస్థానం మొదలు పెట్టిన మోదీ ఇప్పుడు ప్రాంతీయపార్టీల అస్తిత్వాన్ని అంతంచేసే కుతంత్రాల్లో నిమగ్నమయ్యారు. ఒకప్పుడు ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న కాంగ్రెస్‌ను ఎదిరించడంలో కీలకపాత్ర పోషించాయి. ఇప్పుడు అవే మోదీకి ప్రత్యామ్నాయం కావాలంటున్నాయి. నవీన్ పట్నాయక్, కె.చంద్రశేఖరరావు, వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి లాంటి వారు తమ రాష్ట్రాలలో బలంగా ఉన్నారు. వీరి పార్టీలు పార్లమెంటులో బీజేపీని సమర్థిస్తున్నాయి. అయినా మోదీకి సహించడం లేదు. అక్కడా కుంపట్లు రాజేయాలని చూస్తున్నారు. ప్రయత్నం మోదీ విడనాడలేదు. ఆ పార్టీల మీదా ఎప్పుడో ఒకప్పుడు దాడి తప్పదు. నిరంకుశులకు ఇతరుల పొడ కిట్టదు. అందుకే ప్రాంతీయ పార్టీలంటే మోదీకి గిట్టదు.

-ఆర్వీ రామారావ్

సైన్సు శాశ్వతత్వాన్ని తాత్కాలిక ప్రభుత్వాలు శాసించలేవు

డాక్టర్ దేవరాజు మహారాజు

సామాన్యంగా తెలివైనవాళ్లు తెలివిగల పనులు చేస్తారు. తెలివిలేనివారు తెలివితక్కువ పనులు చేస్తారు. కానీ, ఇక్కడ జరిగేదేమంటే తెలివైనవారికి మతపిచ్చి నెత్తికెక్కితే, తెలివైనవారు కూడా తెలివి తక్కువ పనులు చేస్తారు. ఆ పనులు అత్యంత హీనంగా కూడా ఉంటాయి. ఈ విషయం మనం సమకాలీనంలో చూస్తున్నాం. అందుకే మన సమాజంలో గౌరవనీయులైన మూర్ఖుల సంఖ్య పెరుగుతోంది. విద్యార్థుల పాఠ్యాంశాల్లో జాతిపిత గాంధీజీ స్థాయి డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం తీసెయ్యడంవల్ల ఈ దేశ పాలకుల అజ్ఞానం, కుత్సిత బుద్ధీ అవగతమవుతోంది. జీవపరిణామ సిద్ధాంతం తొలగించి ఈ దేశంలో ఒక 'ప్రమాదకరమైన పరిణామం' తీసుకు రావాలని కేంద్రప్రభుత్వ పెద్దలు ఆశిస్తున్నారు. విజ్ఞానం సముపార్జించాలంటే ఎంతో శ్రమించాలి. పరిశ్రమించాలి. కాని, విద్యార్థులకు శ్రమ లేకుండా చేస్తున్నారు. రాబోయే తరాలన్నీ తమ 'రేషనలైజేషన్' అనేపదం ఉపయోగిస్తున్నారు. అసలు పదం ఉపయోగించే అర్హత తమకు ఉందా లేదా అని కూడా వారు ఆత్మవిమర్శ చేసుకోవడం లేదు. దీనికి ప్రతిస్పందనగా ఎన్సీఈఆర్‌టీ తొలగించి పాఠాలు తిరిగి చేరుస్తామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేంద్రానికి లేఖ రాశారు. ఆయన మంత్రివర్గ సభ్యుడు శివన్‌కుట్టి, తామే తమకు కావల్సిన పాఠ్యగ్రంథాలు ముద్రించుకుంటామన్నారు. దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, సైన్సు, ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, మేధావులు కేంద్రప్రభుత్వ చర్యను తీవ్రంగా విమర్శిస్తూ సంతకాలుచేసి కేంద్రానికి పంపారు. విడతలు విడతలుగా ఇంకా పంపుతూనే ఉన్నారు. పాలకులకు చీమ కుట్టకపోతే, ఏం చేయాలన్నది ప్రజలకు తెలుసు.

జీవపరిణామ సిద్ధాంతాన్ని తొలగించి, దానిస్థానంలో సృష్టివాదాన్ని చొప్పించాలని అధికారపార్టీ ప్రయత్నిస్తోంది. అందుకే గుజరాత్, కర్నాటకలో 8 నుంచి10 తరగతులకు భగవద్గీతను పాఠ్యాంశంగా పెట్టింది. అంతేకాదు, దాన్ని జాతీయ గ్రంథం చేయాలని యోచిస్తోంది. గాయత్రి మంత్రాన్ని పార్లమెంటులో ప్రార్థనా గీతంగా పెట్టాలని పథకం వేస్తోంది. కర్నాటకలోనైతే ఒక మతవాది సావర్కర్ ఉపన్యాసాల్ని పాఠ్యాంశాలుగా చేర్చింది. చరిత్ర పాఠ్యగ్రంథాల్లో అనేక మార్పులు, చేర్పులు చేసింది. కొన్ని విశ్వవిద్యాలయాల్లో వాస్తు, జ్యోతిష్యం పాఠ్యాంశాలుగా ఉన్నాయి. దానికితోడు ఇప్పుడు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో భూత వైద్యం కోర్సు ప్రవేశపెట్టింది. సమాజాన్ని వెనక్కి నడిపించడానికి ఇంతకంటే మంచిమార్గం లేదని మన పాలకులకు తెలుసు. ఇకపోతే, ఆవు మూత్రంలో ఎంత బంగారం ఉందో పరిశోధించమని విశ్వ విద్యాలయాలకు ఆదేశాలు పంపడం- హాస్యాస్పదమని, మూర్ఖత్వమని మనం అంటున్నాం గానీ, ఎంతో దార్శనికతతో విప్లవాత్మకమైన, ప్రగతి శీలమైన నిర్ణయాలు తీసుకుంటున్నామని పాపం, పాలకులు భ్రమలో బతుకుతున్నారు. వీటన్నింటిమీదా మేధావుల నిరసన వెల్లువెత్తుతోంది. కేంద్ర ప్రభుత్వానికి ప్రస్తుతం విన్నపాలు, పిటీషన్లు వెళుతున్నాయి. వినకపోతే, ప్రజల కార్యాచరణ మరోరకంగా ఉంటుంది.

మరో భయంకరమైన వార్త దేశ ప్రజల నెత్తిమీద పిడుగులా పడింది. కేంద్ర ప్రభుత్వం ఒక అహేతుకమైన నిర్ణయం తీసుకుంది. "విజ్ఞాన్‌ప్రసార్" ను మూసివేస్తున్నామని ఆకస్మాత్తుగా ప్రకటించి, దేశ ప్రజల అవకాశాన్ని లాగేసుకుంది. అంతేకాదు. ఆ చర్య ఈ దేశ ప్రజల గౌరవాన్ని అవనతం చేసింది. డిపార్టుమెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ భారత ప్రభుత్వం వారి ఆధ్వర్యంలో నడుస్తున్న 'విజ్ఞాన్ ప్రసార్' గురించి 24 ఏప్రిల్ 2023న 'ద స్టేట్స్‌మన్" పత్రిక సంపాదకీయం రాసింది. విజ్ఞాన్‌ప్రసార్ అన్ నేచురల్ డెత్ అనే శీర్షికతో వచ్చిన ఆ ఎడిటోరియల్ ఎన్నో వాస్తవాల్ని దేశప్రజల ముందు పెట్టింది. అది వచ్చిన



వెంటనే ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ తన తీవ్రమైన నిరసనను ప్రకటించింది. న్యూ ఢిల్లీలో ఒక కార్యక్రమంలో -విజ్ఞాన్‌ప్రసార్‌ను మూసివేయవద్దని.. తీవ్రంగా హెచ్చరించింది. విజ్ఞాన్ ప్రసార్‌ను మూసివేయాలని సూచించిన నీతి ఆయోగ్ చర్యను తీవ్రంగా ఖండించింది. వైజ్ఞానిక దృక్పథంతోనే, ఈ దేశం ముందుకు పోతుందన్న తొలిప్రధాని పండిట్ నెహ్రూని మొన్నటిదాకా తక్కువ చేయడానికి ప్రయత్నించి, విఫలమైన కేంద్రం, ఇప్పుడు వైజ్ఞానిక సంస్థల్ని మూసివేయడం ప్రారంభించింది.

'విజ్ఞాన్ ప్రసార్' సంస్థ ఏం చేస్తుంది? అంటే, దేశంలో వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తుంది. అందుకు అవసరమైన పుస్తకాలు, పత్రికలు ప్రచురిస్తుంది. హిందీ, ఇంగ్లీషు భాషల్లోనే కాకుండా కొన్ని భారతీయ భాషల్లో కూడా పత్రికలు ప్రచురిస్తుంది. రాజ్యాంగంలోని 51(ఏ)హెచ్ ప్రకారం, దేశంలో వైజ్ఞానిక స్పృహను కలిగిఉండడం, దాన్ని ప్రచారం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత-అయినప్పుడు సమాజంలో వైజ్ఞానిక స్పృహను ప్రచారంచేసి, పెంపొందించే సంస్థను, అన్ని స్థాయిల్లో విద్యార్థులందరికీ చేరువైన సంస్థను ఉన్న ఫళంగా ఆకారణంగా మూసివేయడం హేయమైన చర్య! ప్రభుత్వ పెద్దల ఛాందసానికి, ప్రభుత్వాధికారుల బాధ్యతా రాహిత్యానికి ఈ చర్య అద్దంపడుతుంది.

'విజ్ఞన్ ప్రసార్' ఒక స్వతంత్ర సంస్థగా 1989లో ప్రారంభమైంది. అప్పటినుండి ఈ సంస్థ వైజ్ఞానిక దృక్పథం ప్రచారం చేయడంలో ఎంతో కృషిచేస్తూ ఉంది. నూతన పరిశోధనలు, అవిష్కరణలు ఎంత ముఖ్యమో, వాటి వివరాలు సామాన్య జనానికి అందించడం కూడా అంతే ముఖ్యం! దేశవ్యాప్తంగా ప్రజాసైన్సు కార్యకర్తలకు వెన్నుదన్నుగాఉన్న విజ్ఞాన్ ప్రసార్‌ను మూసివేయడమంటే దేశప్రజలను అవివేకులుగా, అజ్ఞానులుగా తయారు చేయాలని భావించడమే రైతు నల్లచట్టాలు తిప్పికొట్టినట్లు పౌరసత్వం చట్టాలు తిప్పికొట్టినట్లు దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తవా? గతంలో వేల సంఖ్యలో షహీన్‌బాగ్‌లు వెలసినట్టు ఉద్యమాలు ఊపందుకోవా? వెనక్కి నడుద్దామన్న వారి మెడలువంచి ముందుకు నడిపించవా? ఈ 21వ శతాబ్దపు భారతీయ యువత అంత తేలికగా రాజీపడిపోరు. ఒప్పుకోరు. అసలు ప్రపంచమే వైజ్ఞానిక సృష్టి అయినప్పుడు ఎవడో చెప్పే దైవసృష్టిని ఈ దేశ ప్రజలు విశ్వసిస్తారా? సైన్సు ఊపిరిగా బతుకుతున్న నేటి యువతరం ఆ సైన్సునే ఆయుధంగా చేసుకుని ఎందుకు తిరగబడరూ? ఈ తాత్కాలిక ప్రభుత్వాలు సైన్సు శాశ్వతత్వాన్ని శాసించగలవా? పెరుగుట విరుగుట కొరకేనన్నట్లు మతపిచ్చి ముదిరితే దాన్ని వదిలించే స్థోమత ఈ దేశ ప్రజలకు ఉంది. నియంతలు శాశ్వతంగా నిలిచిపోయిన దాఖలాలు చరిత్రలో ఎక్కడాలేవు.

విజ్ఞాన్‌ప్రసార్ ఇప్పటివరకు వేర్వేరు శాస్త్రవేత్తలు, వేర్వేరు వైజ్ఞానిక రచయితలు రాసిన 300 పుస్తకాలు ప్రచురించింది. ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయి అవార్డుల్ని ప్రతి సంవత్సరం ప్రకటిస్తోంది. అందులో సైన్సు ప్రచారానికి యునెస్కో కళింగ అవార్డు, నేషనల్ సైన్సు పాపులరైజేషన్ అవార్డు, ఇందిరాగాంధీ ప్రైజ్ ఫర్ సైన్స్ పాపులరైజేషన్, ఆత్మారాం అవార్డు ఫర్ సైన్సు బుక్ రైటింగ్ వంటి అవార్డులు నెలకొల్పి నిర్వహిస్తోంది. ఇంగ్లీషు, హిందీ భాషల్లో 'డ్రీమ్ 2024' పేరుతో కళాశాల విద్యార్థులకోసం సైన్స్ జర్నల్ ప్రచురిస్తోంది. బెంగాలి, తమిళం, కన్నడం, ఉర్దూ, గుజరాతీ, మరాఠీ వంటి బారతీయ భాషలలో సైన్సు ప్రచురణలు తెస్తోంది. ఇవేకాక మంత్లీ న్యూస్ లెటర్స్ ప్రచురిస్తోంది. ఉర్దూలో తజస్సుస్, తమిళంలో అరివియల్ పలగై, బెంగాలిలో బిగ్యాన్ కథ, కన్నడంలో కుతూహల్ ఇవి న్యూస్ లెటర్ల పేర్లు. ఇక దూరదర్శన్‌తో కలిసి సంయుక్తంగా నిర్వహించే సైన్స్ కార్యక్రమాలు కొన్ని. అలాగే 'హమ్ రేడియో' ద్వారా పిల్లలకు, పెద్దలకు అవసరమైన వైజ్ఞానిక సమాచారం అందిస్తోంది. పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు 'ఏక్టివిటీ కిట్స్' అందిస్తోంది. వాటివల్ల వాళ్లు సరదాగా ఆడుతూ పాడుతూ కొత్త విషయాలు నేర్చుకుంటారు. విజ్ఞాన్‌ప్రసార్ మహిళలమీద కూడా దృష్టిపెట్టింది. వారికోసం 'జెండర్ అండ్ టెక్నాలజీ' ప్రోగ్రాం రూపొందించింది. ఒక డిజిటల్ లైబ్రరీ'ని అందరికీ అందుబాటులోకి తెచ్చింది. సైన్స్‌క్లబ్‌లు విరివిగా ఏర్పాటుచేసి, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించింది.

-కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

శక్తి కోల్పోలేదు: శరద్ పవార్

ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీలో తిరుగుబాటుదారులకు చోటులేదని ఆ పార్టీ అధినేత శరద్ పవార్ స్పష్టంచేశారు. తనకెలాంటి అలసట లేదని, రాజకీయాల నుంచి తప్పుకునే ప్రసక్తేలేదని తనలోని ఉత్సాహం చెక్కుచెదరలేదని స్పష్టంచేశారు. పార్టీ కార్యకర్తల కోరిక మేరకు తన కర్తవ్యాన్ని కొనసాగిస్తానని, పార్టీని తిరిగి పటిష్ఠవంతం చేస్తానని తెలిపారు. అజిత్ పవార్, ఆయన వర్గం ఎమ్మెల్యేలు ఇటీవల తిరుగుబాటు చేయడం, వయసు పైబడిన కారణంగా క్రియాశీలక రాజకీయాల్లోంచి తప్పుకోవాలంటూ అజిత్ పవార్ సూచించిన నేపథ్యంలో తొలిసారిగా శరద్ పవార్ ఓ ఇంటర్వ్యూలో సూటిగా సమాధానాలిచ్చారు. 'మొరార్జీ దేశాయ్ ఎప్పుడు ప్రధానమంత్రి అయ్యారో మీకు తెలుసా? నేను ప్రధానినో, మంత్రినో కావాలని అనుకోవడం లేదు. ప్రజలకు సేవ చేయాలని మాత్రమే కోరుకుంటున్నాను' అని పవార్ స్పష్టం చేశారు. మాజీ ప్రధానమంత్రి అతల్ బిహార్ వాజ్‌పేయి మాటలను పవార్ గుర్తుచేసుకుంటూ... తాను మరీ అంత వయసు పైబడి లేనని చెప్పారు. 'నన్ను రిటైర్ కావాలని చెప్పేందుకు వాళ్లెవరు? నేను ఇప్పటికీ పని చేస్తూనే ఉన్నాను' అని అజిత్ పవార్ వ్యాఖ్యలను శరద్ పవార్ తిప్పికొట్టారు. ఎన్‌సీపీలో అధికారాలన్నీ తన కుమార్తె సుప్రియా సూలేకు కట్టబెట్టారంటూ ప్రఫుల్ పటేల్ చేసిన ఆరోపణలను శరద్ పవార్ తోసిపుచ్చారు. సుప్రియ రాజకీయాల్లోకి రావాలని పార్టీ కార్యకర్తలు కోరుకున్నారని, లోక్‌సభ ఎన్నికల్లో ఆమె పోటీ చేసి గెలిచారని చెప్పారు. ప్రఫుల్ పటేల్‌కు పదేళ్ల పాటు కేంద్రమంత్రి పదవి ఇచ్చామని, లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా ఆయనను రాజ్యసభకు పంపామని శరద్ పవార్ సమాధానమిచ్చారు.

ఛగన్ భుజ్‌బల్ ఇలాకా నుంచి...

ఎన్‌సీపీని తిరిగి పటిష్ఠవంతం చేయనున్నట్టు ప్రకటించిన శరద్ పవార్...ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్త పర్యటనకు శనివారం శ్రీకారం చుట్టారు. ఎన్‌సీపీ తిరుగుబాటు నేత, రాష్ట్ర మంత్రి ఛగన్‌భుజ్‌బల్ నియోజకవర్గమైన నాసిక్ జిల్లా ఏవల నుంచి ఆయన తన పర్యటన ప్రారంభించారు.

షిండే, ఉద్ధవ్ వర్గాల ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు

ముంబై: శివసేన పార్టీని చీల్చిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలనే డిమాండ్లపై మహారాష్ట్ర శాసనసభ స్పీకర్ రాహుల్ నార్వేకర్ శనివారం స్పందించారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు చెందిన 40 మంది ఎమ్మెల్యేలకు, మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే వర్గంలోని 14 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారు. అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందించాలని కోరినట్లు స్పీకర్ తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ నుంచి శివసేన రాజ్యాంగం తనకు అందినట్లు రాహుల్ నార్వేకర్ చెప్పారు. ముఖ్యమంత్రి షిండే సహా 16 మంది శివసేన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ త్వరలో ప్రారంభమవుతుందని చెప్పారు. దీంతో ఆయన శనివారం ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ శివసేనకు చెందిన 40 మంది ఎమ్మెల్యేలకు, మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే వర్గంలోని 14 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సత్వర విచారణ జరపాలని శాసనసభ సభాపతిని ఆదేశించాలని ఇటీవల శివసేన (యూబీటీ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 2022 జూన్‌లో షిండే వర్గం బీజేపీతో చేతులు కలిపి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అదే సమయంలో శివసేన పార్టీ చీలిపోవడానికి ముందు ఆ పార్టీ చీఫ్‌విప్‌గా పనిచేసిన ఎమ్మెల్యే సునీల్ ప్రభు అదే హోదాలో ఏక్‌నాథ్ షిండే, మరో 15 మంది ఎమ్మెల్యేలను శాసన సభ్యత్వానికి అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ స్పీకర్‌కు పిటిషన్లు సమర్పించారు.

నిలిచిన అమర్‌నాథ్ యాత్ర

చిక్కుకుపోయిన తెలుగు యాత్రికులు

జమ్ము: భారీ వర్షాల కారణంగా వరుసగా రెండో రోజు అమర్‌నాథ్ యాత్ర నిలిచిపోయింది. జమ్ము-శ్రీనగర్ జాతీయరహదారిపై కొండచరియలు విరిగిపడటంతో... పహల్గాం, బల్తాల్ మార్గాల్లోనూ యాత్రను నిలిపివేశారు. దీంతో ఈ వేలాది మంది భక్తులు బల్తాల్, నున్వాన్ బేస్, భగవతి నగర్ బేస్ క్యాంపుల్లోనే ఉండిపోవాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. ప్రతికూల వాతావరణం కారణంగా పంచతర్ణి ప్రాంతంలో 1500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 200 మంది వరకు తెలుగు యాత్రికులు ఉన్నట్లు సమాచారం. ఈ తెల్లవారుజామున కురిసిన వర్షాలకు రాంబన్ వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిని మూసివేశారు. అలాగే అమర్‌నాథ్ యాత్రను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే యాత్ర మధ్యలో ఉన్నవారిని బేస్ క్యాంప్‌ల్లోనే ఉంచినట్లు తెలిపారు. ప్రతికూల వాతావరణం కారణంగా శుక్రవారం కూడా యాత్రను నిలిపివేశారు. దీంతో యాత్రికులను సమీపంలోని బేస్‌క్యాంప్‌లకు తరలించారు. ఈ ఉదయం వారిని యాత్ర కొనసాగించొద్దని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం యాత్రికులంతా షెల్టర్ స్టేషన్లలో సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. పరిస్థితులు అనుకూలించిన తర్వాత యాత్రను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

62 రోజుల పాటు జరిగే వార్షిక అమర్‌నాథ్ యాత్రలో దేశం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొంటారు. దక్షిణ కశ్మీర్ హిమాలయాల్లో 3,888 మీటర్ల ఎత్తులో ఉండే మంచు శివలింగాన్ని దర్శించుకునేందుకు యాత్రికులు పోటెత్తుతారు. ఈ ఏడాది జులై 1న అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమవ్వగా.. ఇప్పటివరకు 82వేల మందికి పైగా దర్శించుకున్నారు. ఆగస్టు 31 వరకు యాత్ర కొనసాగనుంది.

బస్సు- జీపు ఢీ: 8మంది మృతి

హిసార్: హరియాణాలోని జింద్ జిల్లాలో బస్సు, జీపు శనివారం ఉదయం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. పది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే... జింద్ జిల్లాలోని బిబిపూర్ గ్రామ సమీపంలో జింద్-భివానీ రహదారిపై హరియాణా రోడ్డువే బస్సు... జీపును ఢీకొట్టింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

దుక్కి దున్ని...నాట్లేసిన రాహుల్

సోనిపట్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రైతుగా మారారు. శనివారం ఉదయం హరియాణాలోని సోనిపట్‌లో ఆకస్మికంగా పర్యటించిన రాహుల్... పొలంలోకి దిగి ట్రాక్టర్‌తో దుక్కి దున్నారు. మహిళలతో కలిసి నాట్లేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను కాంగ్రెస్ తమ ట్విటర్ ఖాతాలో పంచుకోగా... ఇవి బాగా వైరల్‌గా మారాయి. దిల్లీ నుంచి సిమ్లా (హిమాచల్‌ప్రదేశ్) వెళ్తున్న రాహుల్... మార్గమధ్యంలో సోనిపట్‌లో ఆగారు. బరోడా, మదీనాలోని అనేక గ్రామాల్లో తిరిగిన ఆయన... పొలం పనుల్లో ఉన్న రైతులతో ముచ్చటించారు. ఆ తర్వాత పొలంలోకి దిగి ట్రాక్టర్ నడిపారు. రైతులతో కలిసి వరి నాట్లేశారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భారత్ జోడో యాత్ర చేపట్టిన తర్వాత నుంచి రాహుల్ ఈ మధ్య కాలంలో అనేక రంగాలకు చెందిన ప్రజలతో మమేకమవుతున్నారు. ఇటీవల దిల్లీ-చండీగఢ్ జాతీయరహదారిపై ట్రక్కు నడిపి లారీ డ్రైవర్ల సమస్యలను స్వయంగా తెలుసుకున్న రాహుల్... ఆ తర్వాత ఓ మెకానిక్ దుకాణంగా బండిని రిపేర్ చేస్తూ కన్పించారు. ఇటీవల అమెరికాలో పర్యటించిన సమయంలోనూ రాహుల్ ట్రక్కులో ప్రయాణించిన విషయం తెలిసిందే. గత లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ రాహుల్ ట్రాక్టర్ నడిపారు.

రూ.52 కోట్ల సిసోదియా ఆస్తుల అటాచ్

న్యూదిల్లీ: దిల్లీ మద్యం కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ నేత, దిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోదియా ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. సిసోదియాతోపాటు ఆయన భార్య, ఇతరులకు చెందిన రూ. 52 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. లిక్కర్ స్కామ్‌లో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఈడీ ఈ ఏడాది మార్చిలో సిసోదియాను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. కాగా, సిసోదియా ప్రతిష్ఠను దెబ్బతీయడానికి కేంద్రం కట్టుకథలు అల్లుతుందని ఆప్ ఆరోపించింది. ఈడీ సీజ్ చేసిన రెండు ఫ్లాట్‌లలో ఒకటి 2005లో, మరొకటి 2018లో కొన్నారని, మద్యం పాలసీ కంటే ముందే ఆ ఆస్తులు కొనుగోలు చేశారని, ఆప్ వివరించింది. కాగా అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే ఆప్ ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని తీసుకువచ్చిందని కేంద్రం ఆరోపించింది.

అట్టుడుకుతున్న మణిపూర్

తాజా హింసలో పోలీసు, యువకుడు సహా నలుగురి మృతి

ఇంఫాల్ : మణిపూర్ రాష్ట్రం నివురుగప్పిన నిప్పులా మారింది. గత 24 గంటల్లో రాష్ట్రంలోని జరిగిన వేర్వేరు హింసాత్మక ఘటనల్లో నలుగురు మృతి చెందారు. చురాచంద్‌పూర్ జిల్లా, బిష్ణుపూర్ మధ్య సరిహద్దు ప్రాంతాల్లో జరిగిన కాల్పుల ఘటనల్లో ఒక యువకుడు, పోలీసు సహా నలుగురు మరణించారని, అనేక మంది గాయపడ్డారని పోలీసు వర్గాలు తెలిపాయి. గత సాయంత్రం అనుమానిత తీవ్రవాదులతో జరిగిన కాల్పుల్లో పోలీసు మరణించగా, ఉదయం మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. గత రెండు నెలలుగా ఈ రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతాల మధ్య హింస, హత్యలు, దహన ఘటనలు పెరిగాయి. బిష్ణుపూర్ జిల్లా పరిధిలోని కంగ్వాయ్ ప్రాంతం మణిపూర్ సంక్షోభం ప్రారంభం నుంచి రెండు వర్గాలకు దగ్గరగా ఉండటం వల్ల సున్నితమైన ప్రాంతమని సైనిక వర్గాలు పేర్కొన్నాయి. భద్రతా దళాలు ఈ ప్రాంతంలో 'బఫర్ జోన్' ను ఏర్పాటు చేశాయి. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా నిరోధించేందుకు బలగాలను మోహరించాయి. అయితే దుండగులు ఒకరిపై మరొకరు కాల్పులు జరుపుకోవడానికి కొండలు, లోయ ప్రాంతాల్లోని గ్రామాల గుండా చొరబడ్డారని ఆ వర్గాలు తెలిపాయి. 'శుక్రవారం రాత్రి నుంచి రెండు వైపుల నుంచి దుండగులు ఇటువంటి ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఈ గుంపులు బయటి ప్రాంతాల నుంచి చొరబడ్డాయి. తిరిగి వెళ్లిపోవలసిందిగా స్థానికులు అభ్యర్థించినప్పటికీ వారు వినిపించుకోలేదు. దీంతో సాయుధ బలగాలు క్రమానుగుణంగా ప్రతిస్పందించి, ఇళ్లు ఏవీ దహనం కాకుండా నిరోధించాయి. అయితే కంగ్వాయ్, సాంగ్డో, అవాంగ్ లేఖై గ్రామాల నుంచి రెండు వర్గాలు ఒకరిపై మరొకరు కాల్పులు జరుపుకున్నారు. ఈ కాల్పుల్లో ముగ్గురు మృతి చెందడంతో పాటు కొందరు గాయపడ్డారు' అని అక్కడ క్షేత్రస్థాయిలో ఆపరేషన్‌లో ఉన్న పేరు వెల్లడించడానికి ఇష్టపడని భద్రతా దళ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కాగా, తెల్లవారుజామున కాల్పులు ఆగిపోయినప్పటికీ, లోయ వైపు ఉన్న గుంపులు ఆ ప్రాంతాన్ని అదుపులోకి తీసుకోవడం కోసం భద్రతా బలగాల కదలికలను అడ్డుకోవడం కొనసాగించినట్లు సైనిక వర్గాలు పేర్కొన్నాయి. రెండు వర్గాలు సంయమనం పాటించేలా చేయడం ద్వారా ఆ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించేందుకు భద్రతా బలగాలకు చెందిన ఉన్నతాధికారులు 24 గంటలూ పని చేస్తున్నారు. అయినప్పటికీ అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది. పగటి పూట కూడా అడపాదడపా కాల్పులు కొనసాగాయి. అయితే శనివారం పరిస్థితి నియంత్రణలో ఉందని సైనిక వర్గాలు తెలిపాయి. శుక్రవారం రాత్రి మణిపూర్ పోలీసు కంట్రోల్ రూమ్ నుంచి వచ్చిన సమాచారం ప్రకారం, గత 24 గంటల్లో చాలా చోట్ల గుంపులు చెలరేగిపోవడంతో కొన్నిచోట్ల చెదురుమదురు ఘటనలతో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. తూర్పు ఇంఫాల్, పశ్చిమ ఇంఫాల్, చురాచంద్‌పూర్, బిష్ణుపూర్, కక్చింగ్ జిల్లాల్లో తీవ్రవాదులు, దుండగులు అక్రమంగా ఏర్పాటు చేసిన 8 బంకర్లను మణిపూర్ పోలీసులు, కేంద్ర సాయుధ బలగాల సంయుక్త బృందం శుక్రవారం రాత్రి ధ్వంసం చేసింది. గత 24 గంటల్లో దాదాపు 50 అక్రమ బంకర్లను ధ్వంసం చేశారు. అదే సమయంలో తూర్పు ఇంఫాల్ జిల్లా నుంచి ఐదు అధునాతన ఆయుధాలు, 74 వేర్వేరు రకాల పేలుడు పదార్థాలు, ఐదు అత్యంత పేలుడు హ్యాండ్ గ్రనేడ్‌లను స్వాధీనం చేసుకున్నారు. మణిపూర్‌కు చెందిన వేర్వేరు జిల్లాల్లోని కొండ, లోయలో దాదాపు 126 నాకాలు/చెక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. అలాగే వేర్వేరు జిల్లాల్లో చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన 270 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

షిండే సీటు గల్లంతే

బాంబు పేల్చిన ఆదిత్య ఠాక్రే

ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సీఎం కుర్చీ ఖాళీ కాబోతోందని, ఆయనను రాజీనామా చేయాలని కోరినట్లు తనకు స్పష్టమైన సమాచారం ఉందని శివసేన(ఉద్ధవ్) పార్టీ నేత, మాజీమంత్రి ఆదిత్య ఠాక్రే చెప్పారు. మహారాష్ట్ర మంత్రివర్గ విస్తరణ నేడో, రేపో జరగబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్న వేళ ఆదిత్య ఠాక్రే చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఏక్‌నాథ్ షిండేతో మొదలుపెట్టి ప్రభుత్వంలో భారీ మార్పులు జరగబోతున్నాయని ఆయన జోస్యం చెప్పారు. ముఖ్యమంత్రి (ఏక్‌నాథ్ షిండే)ని రాజీనామా చేయమని అడిగినట్టు తనకు తెలిసిందని, ప్రభుత్వంలో కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉందని ఆదిత్య శనివారం మీడియాకు తెలిపారు. అజిత్ పవార్, ఆయన అనుచరులు ప్రభుత్వంలో చేరగానే మంత్రి పదవులు దక్కించుకోవడంపై షిండే వర్గం శివసేన నేతలు అసంతృప్తితో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఆదిత్య వ్యాఖ్యలపైనా చర్చ మొదలైంది. కాగా, మహారాష్ట్ర ప్రభుత్వంలో అజిత్ పవార్ వర్గీయులు చేరడంతో షిండే వర్గానికి చెందిన 20 మంది ఎమ్మెల్యేలు ఉద్ధవ్ ఠాక్రే (యూబీటీ)తో మంతనాలు జరుపుతున్నట్లు ఎంపీ సంజయ్ రౌత్ ఇటీవల వెల్లడించారు. మరోవైపు, సీఎం పదవి నుంచి తప్పుకునే ఆలోచన ఏదీ లేదని, ఎన్‌సీపీ నేతల విషయంలో శివసేనలో ఎలాంటి తిరుగుబాటు లేదని ఏక్‌నాథ్ షిండే తెలిపారు. ఈ విషయాన్ని శివసేన నేత ఉదయ్ సావంత్ బలపరచారు. షిండే నాయకత్వం ప్రతి ఒక్కరినీ పరిగణనలోకి తీసుకుంటోందని, ఏక్‌నాథ్ షిండేపై ఎమ్మెల్యేలు, ఎంపీలంతా విశ్వాసం వ్యక్తం చేశారని, షిండే రాజీనామా చేస్తారంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని సావంత్ చెప్పారు.

కిడ్నాప్ చేసి...బలవంతంగా కాళ్లు నాకించి...

మధ్యప్రదేశ్‌లో మరో దారుణం

గ్వాలియర్: ఆదివాసీ యువకుడిపై ఓ వ్యక్తి మూత్రవిసర్జనకు పాల్పడిన దారుణ ఘటన మరవకముందే మధ్యప్రదేశ్‌లో మరో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఓ యువకుడిని కిడ్నాప్ చేసిన కొందరు దుండగులు... కదిలే కారులో అతడిని చితకబాదారు. అంతటితో ఆగకుండా అతడితో బలవంతంగా తమ పాదాలు నాకించి వికృతంగా ప్రవర్తించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఓ యువకుడిని బలవంతంగా కారులోకి ఎక్కించుకున్న కొందరు...మార్గమధ్యంలో అతడిపై దాడికి పాల్పడినట్లుగా ఆ వీడియోలో ఉంది. చెప్పులతో అతడి ముఖంపై తీవ్రంగా కొడుతూ...అభ్యంతరకరంగా తిట్టారు. ఆ తర్వాత ఇద్దరు యువకులు అతడితో బలవంతంగా తమ పాదాలు నాకించారు. ఈ తతంగమంతా కారులో ఉన్న మరో వ్యక్తి వీడియో తీశాడు. ఈ వీడియో వివాదాస్పదం కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన గత శుక్రవారం చోటుచేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. బాధితుడు, నిందితులందరూ గ్వాలియర్ జిల్లాలోని దబ్రా ప్రాంతానికి చెందినవారని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని, మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. నిందితులు ఆ యువకుడిపై ఎందుకు దాడి చేశారనేది పోలీసులు వెల్లడించలేదు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని సిధి జిల్లాలో ఆదివాసీ యువకుడిపై ఓ వ్యక్తి మూత్రవిసర్జన చేసిన ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేయగా...అతడి ఇంటిని అధికారులు కూల్చేశారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్...బాధిత ఆదివాసీ యువకుడిని తన ఇంటికి ఆహ్వానించారు. సీఎం అతడి కాళ్లు కడిగి క్షమాపణలు తెలిపిన విషయం తెలిసిందే.

సంపన్నుల కోసమే

ఏసీ చైర్‌కార్ టికెట్లపై 25శాతం డిస్కౌంట్

రైల్వే శాఖ కీలక నిర్ణయం

న్యూదిల్లీ: ఏసీ చైర్ కార్, ఎగ్జిక్యూటివ్ క్లాస్ టికెట్ ధరలపై రైల్వేశాఖ ఓ నిర్ణయం తీసుకుంది. ఆయా తరగతులు కలిగిన అన్ని రైళ్లలో టికెట్ ధరపై 25 శాతం వరకు డిస్కౌంట్ ఇచ్చేందుకు నిర్ణయించింది. వందేభారత్ సహా అనుభూతి, విస్టాడోమ్ కోచ్‌లు కలిగిన రైళ్లకూ ఇది వర్తిస్తుంది. ఆక్యుపెన్సీ ఆధారంగా టికెట్ ధరలపై ఈ డిస్కౌంట్ ఇవ్వనున్నారు. ఆక్యుపెన్సీ పెంచే లక్ష్యంతో రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. టికెట్ ధరలను నిర్ణయించే అధికారం ఆయా రైల్వే జోన్లలో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌కు కట్టబెట్టింది. దేశవ్యాప్తంగా వందే భారత్ రైళ్లు విరివిగా అందుబాటులోకి వస్తున్నాయి. కొన్ని రూట్లలో ఆదరణ బాగానే ఉన్నప్పటికీ..మరికొన్ని రూట్లలో టికెట్ ధరలు అధికంగా ఉన్న కారణంగా ఆక్యుపెన్సీ తక్కువగా ఉంటోంది. దీనికి తోడు ఎండలు తగ్గి వర్షాలు కూడా పడుతుండడంతో ఏసీ బోగీల్లో.. ముఖ్యంగా చైర్‌కార్లలో ప్రయాణానికి ఆశించిన మేర ప్రయాణికుల నుంచి డిమాండ్ ఉండకపోవచ్చు. ఈ నేపథ్యంలో రైల్వే బోర్డు కొత్త పథకంతో ముందుకొచ్చింది. అనుభూతి, విస్టాడోమ్ కోచ్‌లు కలిగిన రైళ్లు సహా ఏసీ చైర్‌కార్, ఎగ్జిక్యూటివ్ తరగుతులు కలిగిన అన్ని రైళ్లకూ ఈ స్కీమ్ వర్తిస్తుందని రైల్వే బోర్డు తెలిపింది. డిస్కౌంట్ అనేది బేసిక్ ఫేర్‌లో గరిష్ఠంగా 25 శాతం వరకు ఇవ్వనున్నారు. రిజర్వేషన్, సూపర్ ఫాస్ట్ సర్‌చార్జి, జీఎస్టీ వంటి ఇతర చార్జీలు మాత్రం అదనంగా వర్తిస్తాయి. గడిచిన 30 రోజుల్లో 50 శాతం కన్నా తక్కువ ఆక్యుపెన్సీ కలిగిన రైళ్లను పరిగణనలోకి తీసుకోవచ్చని పేర్కొంది. డిస్కౌంట్ నిర్ణయించే ముందు ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలను సైతం పరిగణనలోకి తీసుకోనున్నారు. ఆక్యుపెన్సీని బట్టి రైలు ప్రయాణించే మొత్తం దూరానికి లేదా ఎంపిక చేసిన స్టేషన్ల మధ్య కూడా ప్రయాణానికి డిస్కౌంట్ వర్తింపజేయొచ్చని తెలిపింది. డిస్కౌంట్ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని, ఇప్పటికే బుక్ చేసుకున్న వారికి ఇది వర్తించదని తెలిపింది. హాలిడే, ఫెస్టివల్ స్పెషల్ రైళ్లకు ఈ స్కీమ్ వర్తించదని రైల్వే బోర్డు స్పష్టం చేసింది.

మహాకూటమి పదిలం

2024లో బీజేపీకి ఓటమి తప్పదు : జేడీయూ

పాట్నా: బీహార్‌లో మహాకూటమి పదిలంగా ఉందని, తమ మధ్య ఎలాంటి సమస్యలు లేవని, బీజేపీ ప్రేరేపిత వదంతులు నమ్మవద్దని జేడీ(యూ) అధ్యక్షుడు, రాష్ట్ర సీఎం నితీశ్ కుమార్ శనివారం స్పష్టంచేశారు. ఆర్జేడీ నేత, ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌పై తాజా చార్జిషీటు దాఖలుకు తోడు నితీశ్‌కు నమ్మకస్తుడైన విద్యాశాఖ అదనపు సీఎస్ పాఠక్‌తో ఆర్జేడీనేత, ఆశాఖ మంత్రి చంద్రశేఖర్ మధ్య వివాదం నేపథ్యంలో మహాకూటమిలో సమస్యలు ఉన్నట్లు వదంతులు ఎక్కువయ్యాయి. జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుష్వాహా శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహాకూటమిలో సమస్యలు ఉన్నట్లు బీజేపీ ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. నితీశ్ కుమార్ చొరవతో ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రావడంతో చిటపటాయిస్తోందని బీజేపీని విమర్శించారు.

హింసకు టీఎంసీనే కారణం

- బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో హింసను ఖండించిన పార్టీలు
- రాష్ట్రపతి పాలన విధించాలన్న బీజేపీ

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల సందర్భంగా వేర్వేరు జిల్లాల్లో చోటుచేసుకున్న హింసలో 11 మంది హత్యకు గురికావడాన్ని అన్ని రాజకీయ పార్టీలు శనివారం ఖండించాయి. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని బీజేపీ కోరింది. ఈ హింసాకాండలో ఆరుగురు మద్దతుదారులను కోల్పోయిన అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్షమే ఈ హింసను ప్రేరేపించిందని, ఓటర్లకు భద్రత కల్పించడంలో కేంద్ర బలగాలు విఫలమయ్యాయని ఆరోపించింది. మరోవైపు, టీఎంసీ గూండాలు స్వేచ్ఛగా తిరుగుతూ, ప్రజల తీర్పును అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ సలీమ్ మాట్లాడుతూ కేంద్ర బలగాలను సరిగా సమీకరించలేదని అన్నారు. అర్ధరాత్రి నుంచి హత్యకు గురైన వారిలో టీఎంసీ నుంచి ఆరుగురు సభ్యులు, బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్, ఐఎస్ఎఫ్ నుంచి ఒక్కొక్క కార్యకర్త ఉన్నారు. అయితే రాజకీయ గుర్తింపు తెలియని మరొక వ్యక్తి కూడా హత్యకు గురయ్యాడు. రాష్ట్ర సీనియర్ మంత్రి శశి పంజా మాట్లాడుతూ గత రాత్రి నుంచి దిగ్భ్రాంతి కలిగించే ఘటనలు జరిగాయి. బీజేపీ, సీపీఎం, కాంగ్రెస్ కుమ్మక్కై కేంద్ర బలగాలను డిమాండ్ చేస్తున్నాయి. ఆ బలగాలను ఎక్కడ మోహరించారు? టీఎంసీ కార్యకర్తలు హత్యకు గురవుతున్నారు. కేంద్ర బలగాలు ఎక్కడ? అని ఆయన ప్రశ్నించారు. జూన్ 8న పంచాయతీ ఎన్నికలను ప్రకటించినప్పటి నుంచి 27 మంది హత్యకు గురయ్యారు. వారిలో 17 మంది తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన వారు, మొత్తం మృతుల్లో 60 శాతం వారేనని టీఎంసీ ఒక ప్రకటనలో పేర్కొంది. 'మీడియా ఆరోపిస్తున్నట్లుగా నిజంగా తృణమూల్ కాంగ్రెస్ హింసను ప్రేరేపిస్తున్నట్లయితే, వారి సొంత కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని ఎందుకు చంపుతారు? ప్రతిపక్షం ఓటమిని అంగీకరించదు. ఇప్పుడు ఎన్నికలను హింస ఏ విధంగా ప్రభావితం చేసిందనే దానిచుట్టూ కథనాన్ని రూపొందించడానికి ప్రయత్నిస్తోంది. మీడియాలో మిత్రులను ఉపయోగించుకుంటుంది' అని తెలిపింది. పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా 60 వేలకు పైగా పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అయితే 60 కేంద్రాల్లో మాత్రమే పోలింగ్ ప్రక్రియలో అంతరాయం ఏర్పడింది. ఇక్కడ ఒక హింసాత్మక ఘటన కూడా నివేదించబడలేదని ఆ ప్రకటన వివరించింది. ఇదిలాఉండగా, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్ర అసెంబ్లీలో విపక్ష నాయకుడు, బీజేపీకి చెందిన సువేందు అధికారి డిమాండ్ చేశారు. 'రాష్ట్ర పరిపాలనలో నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగడం ఎండమావి. రాష్ట్రపతి పాలన లేదా ఆర్టికల్ 355 కింద మాత్రమే ఎన్నికల నిర్వహణ సాధ్యం' అని ఆయన తెలిపారు. రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్ఈసీ పని చేస్తోందని, మొత్తం తన విధుల నిర్వహణలో అది విఫలమైందని బీజేపీ నాయకుడు రాహుల్ సిన్హా అన్నారు. 'ఈరోజు పోలింగ్ తీరు చూస్తేనే ఇది అర్థమవుతోంది. అనేక పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలు లేవు. కొన్ని చోట్ల రాష్ట్ర పోలీసులు కూడా గైర్హాజరయ్యారు. సీసీటీవీలకు వైర్‌లు కూడా అనుసంధానం చేయని ఫొటోలు, వీడియోలు నా దగ్గర ఉన్నాయి. ఇది నిజంగా దుర్మార్గులు హింసకు పాల్పడటానికి సహాయపడింది' అని ఆయన తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ సలీమ్ మాట్లాడుతూ 'హైకోర్టు ఆదేశించినప్పటికీ కేంద్ర బలగాలను సరిగా సమీకరించకపోవడంతో కేంద్ర, రాష్ట్ర బలగాల మధ్య చిచ్చు ఏర్పడింది' అని అన్నారు. అంతిమంగా ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని ఆయన చెప్పారు. 'విపరీతమైన ఆయుధాల వినియోగం ఉంది. ఈ అన్ని సంఘటనల వెనుక అధికార తృణమూల్ కాంగ్రెస్ ఉంది. పోలింగ్ రోజున అవాంతరాలు సృష్టించి ఓట్లు కొల్లగొట్టేందుకు ముందుగానే ప్రణాళిక చేసుకున్నారు. అయితే కొన్నిచోట్ల ప్రజలు ప్రతిఘటించడం చూసి సంతోషిస్తున్నాను' అని సీపీఎం నాయకుడు డాక్టర్ సుజన్ చక్రవర్తి పీటీఐకి తెలిపారు.

ప్రశ్నించడం నేర్చుకుందాం

- హక్కుల సాధన, రక్షణకు ఉద్యమించాలి
- ఏఐటీయూసీ యువ మహిళా కార్మిక నేతల వర్క్‌షాప్ ప్రారంభ సభలో వహీదా నిజాం పిలుపు

విశాలాంధ్ర–ఒంగోలు: ప్రతి మహిళ నాయకత్వాన్ని, ప్రశ్నించడాన్ని అలవర్చుకోవాలని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి వహీదా నిజాం పిలుపునిచ్చారు. పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలమని నొక్కిచెప్పారు. కార్మిక సంఘంలో పనిచేయడమంటే యుద్ధంలో పాల్గొనడానికి సమానమని అన్నారు. నేడున్న దిగజారుడు రాజకీయాలతో కార్మిక సంఘాలను పాలకులు చిన్నచూపు చూస్తున్నారన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో శనివారం ఏఐటీయూసీ యువ మహిళా ట్రేడ్ యూనియన్ శిక్షణా తరగతులను వహీదా నిజాం ప్రారంభించారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ దేశంలో కార్మికలోకం ముందు అనేక సవాళ్లున్నాయని, బీజేపీ పాలనలో కార్మికులు హక్కులు, చట్టాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కును హరించిందన్నారు. మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వటానికి ఈ ప్రభుత్వానికి మనసు ఒప్పటం లేదన్నారు. కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన ఆశా వర్కర్లకు జీతాలు ఇవ్వలేదన్నారు. కనీస వేతనం రూ.23 వేలు సాధనకు ప్రతి కార్మికుడు ఉద్యోగమించాలని వహీదా నిజాం పిలుపునిచ్చారు. మహిళలపై లైంగిక వేధింపులు, హింస, దురాగతాలు పేట్రేగిపోయాయని, దేశ కీర్తిప్రతిష్ఠలు పెంచిన మహిళ రెజ్లర్లకు సైతం రక్షణ కరవైందన్నారు. డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌పై నేటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని తెలిపారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ మహిళలను రెండవ తరగతి ప్రజలుగా కించపర్చడం ఆక్షేపణీయమన్నారు. ప్రతి మహిళ చైతన్యవంతమై ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ వర్క్‌షాపును మహిళలు సద్వినియోగించుకోవాలని వహీదా నిజాం సూచించారు.

పెరిగిన మహిళా శ్రామిక భాగస్వామ్యం: ఓబులేసు

దేశంలో మహిళా శ్రామికుల భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజనం పథక కార్మికులు, స్కీం వర్కర్లుగా అనేక రంగాలలో మహిళల ప్రాతినిధ్యం పెరిగిందని చెప్పారు. శిక్షణా తరగతులు వచ్చిన ప్రతి మహిళ చైతన్యవంతమై నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి జగన్ కూడా ప్రధాని మోదీ మార్గంలో పయనిస్తూ మహిళలను చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిన బాధ్యతల ప్రభుత్వాలదన్నారు. గౌరవ వేతనం పేరుతో తక్కువ జీతాలిస్తూ మహిళల శ్రమను దోపిడీ చేస్తున్నారని ఓబులేసు విమర్శించారు. పనిగంటలను ఎనిమిది నుంచి 12 గంటలకు పెంచారని, గౌరవ వేతనాలు ప్రతినెలా ఇవ్వటం లేదన్నారు.

ఇదిలావుంటే, భారతదేశ కార్మిక ఉద్యమ చరిత్ర, ఉజ్వల ఘట్టాలు అనే అంశంపై చలసాని రామారావు, 'మహిళలను సంఘటితం చేయడంలో కార్మిక సంఘాల పాత్ర– ఏఐటీయూసీ నిర్మాణంలో శ్రామిక మహిళల పాత్ర' అంశంపై వహీదా నిజాం బోధించారు. 'భారతదేశ చరిత్ర సంస్కృతి'పై డి.సోమ సుందర్, 'మహిళలు –కులవివక్ష –మతం' అంశంపై కె.రాజశేఖర్ తరగతులు నిర్వహించారు. శిక్షణా తరగతులకు ప్రిన్సిపల్‌గా ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రాధాకృష్ణమూర్తి, కార్యదర్శిగా అంగన్వాడీ వర్కర్స్& హెల్పర్స్ అసోసియేషన్ ఏపీ ప్రధాన కార్యదర్శి లలిత కుమారి వ్యవహరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్.వెంకట సుబ్బయ్య, ఏఐటీయూసీ ప్రకాశం జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పీవీఆర్ చౌదరి పాల్గొన్నారు. ఏపీ ప్రజానాట్యమండలి ప్రకాశం జిల్లా కార్యదర్శి ఆర్ రామకృష్ణ నేతృత్వంలో ప్రేమ్ కుమార్, బాలకోటయ్య, కే అనంతలక్ష్మి, ఎస్ ఎం షరీఫ్ తదితరులు ఆలపించిన అభ్యుదయ గీతాలు ఆకట్టుకున్నాయి.

తమిళనాట జన సేవా దళ్ శిక్షణ శిబిరం ప్రారంభం

చెన్నై: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా లక్ష మంది జన సేవా దళ్ కేడట్లకు శిక్షణ ఇచ్చేందుకు పార్టీ సంకల్పించింది. ఇదే క్రమంలో తమిళనాడు, కృష్ణగిరి జిల్లా, దంతెనికొట్టలో జనసేవా దళ్ శిక్షణ శిబిరాన్ని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ప్రారంభించారు. లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రజాద్యోమాలను, రాజ్యాంగాన్ని పరిరక్షించడమే మా లక్ష్యమని ఈ సందర్భంగా సేవాదళ్ ఇంచార్జి కూడా అయిన నారాయణ ఉద్ఘాటించారు. కేడట్లకు శిక్షణను సీపీఐ నాయకుడు, జన సేవా దళాధిపతి లఘుమయ్య మొదలు పెట్టారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సంతానం పాల్గొన్నారు.

ఇది బీజేపీ ఎన్నికల ఎత్తుగడ

ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకించాలి: వక్తల పిలుపు

విశాలాంధ్ర–విజయవాడ: స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలను క్రూరంగా అణిచివేస్తున్న బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతి తీసుకురావడానికి చేస్తున్న ప్రయత్నాలు అభ్యంతరకరమని ఆలోచనాపరులు, ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాల నేతలు అన్నారు. సమానత్వం సాధించకుండా ఉమ్మడి పౌరస్మృతిని రుద్దడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. భారత్ బచావో, ముస్లిం ఆలోచనాపరుల వేదిక, ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య తదితర సంస్థల అధ్వర్యంలో స్థానిక బాలోత్సవ్‌భవన్‌లో శనివారం ఉమ్మడి పౌరస్మృతికి వ్యతిరేకంగా సమావేశం జరిగింది. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ నాయకురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ రాజ్యాంగ పరిషత్ ఏర్పడినప్పటి నుంచి రాజ్యాంగంపై అనేకసార్లు చర్చలు జరిగాయన్నారు. ఉమ్మడి పౌరస్మృతి ముస్లిం మైనార్టీలు, గిరిజనులపై దాడి చేసే ప్రయత్నమేనని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి పౌరస్మృతికి వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత కమ్యూనిస్టులు, ప్రగతిశీలవాదులపై ఉందన్నారు. ప్రొఫెసర్ అంజిరెడ్డి మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు, ఆర్థిక మాంద్యాన్ని అదుపుచేయలేని ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించడానికి మతరాజకీయాలకు పాల్పడుతున్నదన్నారు.

పాత పెన్షన్ అమలుకు పోరాడాలి

జల్లి విల్సన్ పిలుపు

విశాలాంధ్ర–విజయవాడ: హక్కుల సాధన కోసం చేసే పోరాటంలో రాజీ పడొద్దని ఉపాధ్యాయులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లివిల్సన్ పిలుపునిచ్చారు. విజయవాడలోని ఫర్నిచర్ డీలర్స్ అసోసియేషన్ సమావేశభవనంలో శనివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) 76వ వార్షిక సమావేశం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. జల్లి విల్సన్ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయకుండా జీపీఎస్ విధానాన్ని ఉద్యోగ ఉపాధ్యాయులపై రుద్దాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం పాత పెన్షన్ విధానం కోసం రాజీలేని పోరాటం చేయాలని, సీపీఐ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తుందని, వైసీపీ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖలో చేసిన సంస్కరణల కారణంగా భవిష్యత్‌లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ ఉండకపోవచ్చన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్టీయూ నాయకల మధ్య అంతరాలను తొలగించుకుని యూనియన్ నిర్మాణంపై నాయకులు దృష్టి పెట్టాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేస్తామన్న హామీని సీఎం జగన్ నెరవేర్చలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఈమేరకు హామీ ఇవ్వకపోయినా ఓపీఎస్‌ను రాజస్తాన్, పంజాబ్, చత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాలు అమలు చేశాయని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు.బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల విద్యార్థులకు ప్రాథమిక విద్యను దూరం చేసే విధంగా నూతన జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ఉన్న 117వ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటీఎస్ విధానాన్ని అమలు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ నిబంధనలు రూపొందించి పదోన్నతులు, బదిలీలు కల్పించాలని సూచించారు. ఆదర్శ ఉపాధ్యాయులకు 010 కింద జీతాలివ్వాలన్నారు. ఉమ్మడి సేవల సమస్యను పరిష్కరించి పాఠశాల సహాయకులకు జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్థిక కార్యదర్శి ఎంవీఎస్ఎన్‌ప్రసాద్, మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోసఫ్ సుధీర్, మల్లు రఘునాథ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై ఆగస్టు 7న

విజయవాడలో మహాధర్నా

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున సాగు చేస్తున్న రైతులకు తెలంగాణ ప్రభుత్వ తరహాలో ఎకరానికి రూ.10 వేలు ఇవ్వాలని, ఇతర రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 7న విజయవాడలో మహాధర్నా నిర్వహించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి సమావేశం నిర్ణయించింది. సంఘం అధ్యక్షులు పి.రామచంద్రయ్య అధ్యక్షతన శనివారం ఆన్ లైన్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు రావుల వెంకయ్య పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు వ్యవసాయ ఉత్పత్తులకు ప్రకటించిన మద్దతు ధరలు అశాస్త్రీయంగా ఉన్నాయని సమావేశం ఆక్షేపించింది. దీనివల్ల కనీస మద్దతు ధరలకు రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోలేని దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తరహాలో రైతులకు ఎకరానికి రూ.10 వేలు సాగు సాయం అందించాలని, డాక్టర్ స్వామి నాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం (సి2+ 50) అమలు చేయాలని డిమాండ్ చేసింది. వ్యవసాయ విద్యుత్ మోటర్లకు మీటర్లు బిగించే విధానాన్ని ఉపసంహరించుకోవాలని, ఉచిత విద్యుత్ కొనసాగించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని సమా వేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కౌలు రైతులతో సహా రైతులందరి అన్నిరకాల పంట రుణాలను రెండు లక్ష రూపాయల వరకు మాఫీ చేయాలని, ఇందుకోసం కేరళ తరహా రుణ ఉపశమన చట్టం తేవాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. అలాగే 60 సంవత్సరాలు పైబడిన రైతు, కౌలు రైతులకు ప్రతి నెల పదివేల రూపాయలు పింఛన్ అందించాలని కోరింది. జులై 10, 11 తేదీలలో మండల కేంద్రాలలో సామూహిక దీక్షలు, ధర్నాలు నిర్వహించి తహసీల్దార్లకు వినతి పత్రాలు ఇవ్వాలని, జులై 17,18,19 తేదీలలో నియోజకవర్గ కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు, జులై 24న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించాలని నిర్ణయిస్తూ ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.